## నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


### నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
కడలిలోని అలలు కదలిసాగుచునుండ
లాగుకొనుచు నాపు లాఘవముగ
బాధ్యతలును గూడ వసుధ నరులకెల్ల
పట్టిలాగుచుండు పరుగులిడగ
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


### విలేకరులు కావలెను
నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.
పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 28 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | జూలై 27, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# దేశ భవిష్యత్‌కు యువశక్తే పునాది

## - జై జవాన్ - జై కిసాన్ -జై యువ అని నినదించండి


● లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి వయస్సు 21 ఏండ్లకు తగ్గించాలి ● తీర్మానాన్ని ఉభయ సభల్లో అమోదించి కేంద్రానికి పంపిస్తాం ● ఢిల్లీ ఉద్యమ బాధిత కుటుంబాలకు సాయం అందించాలి : జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 26:** యువశక్తే దేశ భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని, అందుకే 'జై జవాన్ – జై కిసాన్ – జై యువ' అని నినదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తుల కనిష్ఠ వయోపరిమితి ని 25 ఏండ్ల నుంచి 21 ఏండ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. జాతీయ మీడియా ప్రతినిధులు ఆదివారం హైద రాబాద్‌లో ఆయనను కలిసిన సందర్భంలో పలు విషయాల పై స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదేస్థాయిలో రాజకీయ



వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల మిగతా2లో...

# వీర జవాన్ల త్యాగం ఎప్పటికీ స్ఫూర్తిదాయకం: ప్రధాని మోడీ



**హైదరాబాద్, జూలై 26:**కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రధాని మోడీ స్పందించారు. "కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారతదేశాన్ని రక్షించడంలో మన వీర సైనికులు చూపిన అసాధారణ ధైర్యసాహసాలకు, అంకితభావానికి దేశం యావత్తూ కృతజ్ఞతలు తెలుపుతోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ మిగతా2లో...

# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం



**న్యూఢిల్లీ, జూలై 26:** కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా 36 రోజులుగా విద్యార్థుల చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ శాఖను అప్పగించారు. ఆదివారం బాధ్యతలు మిగతా2లో...



## బాలకృష్ణను పరామర్శించిన బాబు..

**హైదరాబాద్, జూలై 26:** నగరంలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఎఐజి) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు, హిందూపురం ఎంఎల్ఏ నందమూరి బాలకృష్ణను ఏపి సిఎం చంద్రబాబు ఆదివారం పరామర్శించారు. గత వారం సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు మిగతా2లో...


# కొమురవెల్లిలో రైల్వే హాల్ట్ స్టేషన్

● ప్రారంభించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ● వచ్చే ఏడాది కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం ● ట్రిపుల్‌ఆర్‌పై త్వరలోనే మోడీ శుభవార్త ● హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు




## సర్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు గల్లంతే!

ఎన్యూమరేషన్ పత్రాల పూరింపులో ఇక్కట్లు
కొనసాగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియ
శాశ్వత వలస, మరణించిన వారి ఓట్ల తొలగింపు
ఆగస్టు 3లోగా పూర్తి చేసేందుకు ఈసీ కసరత్తు



**హైదరాబాద్, జూలై 26:** ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి ఎన్నికల సంఘం నియమించిన బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తిరిగివ్వకుంటే ఓటు గల్లంతు కానుంది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఫారాల పూరింపును కొంత సడలించింది. వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో మిగతా2లో...



## ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

రూ.2,278.14 కోట్లతో 2,009.23 ఎకరాల్లో ఏర్పాటు :
ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 26:** ఉత్తర తెలంగాణకు గేమ్‌చేంజర్‌గా మారనున్న ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతి ఇచ్చిందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2,278.14 కోట్లతో నిర్మించనున్న ఎయిర్‌ఫీల్డ్‌కు అవసరమైన 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్ఓ కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు మిగతా2లో...

## రానున్న 3 రోజుల్లో తెలంగాణలో విస్తారంగా వర్షాలు..



**హైదరాబాద్,జూలై 26:** వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల మిగతా2లో...




## ఇది ఆరంభమే...

ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదు
బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమించాయి
అండగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు : సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

## ఆరోగ్య రంగానికి ప్రధాని మోడీ పెద్దపీట: రాంచందర్ రావు



**హైదరాబాద్, జూలై 26:**ఆరోగ్య రంగానికి ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద పీట వేశారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, రోగికి చేసే వైద్యం ఒక వ్యక్తికే కాకుండా సమాజానికి, దేశానికి చేసే సేవగా భావించాలని ఆయన తెలిపారు. బిజెపి డాక్టర్స్ సెల్ మిగతా2లో...

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# దేశ భవిష్యత్‌కు యువశక్తే పునాది

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏండ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచస్థాయి సంస్థలకు సైతం నాయకత్వం వహిస్తోందని వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏండ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏండ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏండ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపుదల, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ

# కొమురవెల్లిలో రైల్వే హాల్ట్ స్టేషన్

**కొమురవెల్లి, జూలై 26:** తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మోడీ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే హాల్ట్ స్టేషన్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది ఒక చారిత్రాత్మకమైన ఘట్టమన్నా రు. రెండేండ్లలో ఈ స్టేషన్‌ను నిర్మించి స్వామి వారి సన్నిధిలో భక్తులకు అంకితం చేస్తున్నామని.. దూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనా నికి వచ్చే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి కేవలం రూ.20తో ఇక్కడికి రావచ్చన్నారు. ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ లైన్‌ను త్వరలోనే రూ.300 కోట్లతో విద్యుద్దీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31తేదీ లోగా సిరిసిల్లకు రైలు ప్రారంభిస్తా మన్నారు. వచ్చే ఏడాది వేములవాడ, 2029లోగా కొత్తపల్లి వరకు ఈ రైల్వేలైన్ పనులు పూర్తి చేస్తామన్నారు.

హైదరా బాద్ నుంచి యాదాద్రి వరకు రూ.500 కోట్లతో నిర్మించ బోయే ఎంఎంటీఎస్ రైలుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేసి ఇవ్వాల న్నారు. రూ.3500 కోట్లతో పాండురం గాపురం, భద్రాచలం పనులు పూర్తి చేయబోతున్నా మని, తెలంగాణలో ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు వందేభారత్ ట్రైన్లను తెలంగాణకు ఇచ్చిందన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందనీ.. వచ్చే ఏడాది దాన్ని ప్రారం భించుకోబోతున్నామన్నారు రూ.5 లక్షల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు బుల్లెట్ ట్రైన్ల ద్వారా జరుగుతోందని.. తెలంగాణ అభివృద్ధిలో బుల్లెట్ ట్రైన్లు గేమ్ చేంజర్ కాబోతు న్నాయన్నారు. ట్రిపుల్ ఆర్కు సంబంధించి త్వరలోనే మోడీ శుభవార్త అందిస్తారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. లక్షలాది మంది మల్లన్న భక్తులు అనేక ఏండ్లుగా రైల్వే స్టేషన్ కావాలని కోరిన ట్లు తెలిపారు.

ప్రభు త్వం వారి కోరికను నెరవేర్చిం దన్నారు. అంతకుముందు కొము రవెల్లి మల్లన్న ఆల యాన్ని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవనేని రఘునందన్‌రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగా మ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పింగళి శ్రీపాల్ రెడ్డి, అంజిరెడ్డి, రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆలయ అధికా రులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

# సర్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు గల్లంతే!

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో ప్రస్తుత చిరునామా రాసి ఇవ్వాలని సూచిస్తోంది. అసంపూర్తి వివరాలకు సంబంధించి ఎన్నికల సంఘం ఇచ్చే నోటీసుకు నిర్దేశించిన ఏదేని ఐడీ కార్డుతో బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుంది. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి ఎన్నికల సంఘం నియమించిన బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తిరిగివ్వకుంటే ఓటు గల్లంతు కానుంది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఫారాల పూరింపును కొంత సడలించింది. వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలంలో ప్రస్తుత చిరునామా రాసి ఇవ్వాలని సూచిస్తోంది. అసంపూర్తి వివరాలకు సంబంధించి ఎన్నికల సంఘం ఇచ్చే నోటీసుకు నిర్దేశించిన ఏదేని ఐడీ కార్డుతో బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుంది. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు రద్దవుతుందనే విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటరు నమోదు పత్రాలు నింపడానికి సహాయ పడేందుకు ఎన్నికల సంఘం కొత్తగా మరిన్ని హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది. **బీఎల్ఓల ఇక్కట్లు....** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో బాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి సేకరించేందుకు పలుచోట్ల బీఎల్ఓలు అవస్థలు పడుతున్నారు. చిరునామాలు మారడం, పట్టణాల్లో ఓటు హక్కు ఉన్నవారికి గ్రామాల్లోనూ ఉండడం వంటి కారణాలతో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్నా, కొందరి ఓటర్ల ఆచూకీ లభించడం లేదు. రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నవారు పట్టణాల్లో ఓటును వదిలిం చుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే వారు స్వగ్రా మాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్నారు. దీంతో వారు తిరిగి బీఎల్ఓలకు పత్రాలను సమర్పించడం లేదు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగిస్తున్నారు. గ్రామాలను వదిలి వెళ్లిన జాబితాను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. అందుబాటులో లేని ఇంటి ఓనర్లను ఫోన్లో సంప్రదిస్తున్నారు. కొంతమంది సమయం ఉంది కదా! అని దాట వేస్తుండగా, మరికొందరి ఫోన్లు పని చేయక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పక్కింటి వారితో మాట్లాడి స్థానికంగా ఉండటం లేదని వివరాలు నమోదు చేసుకుం టున్నారు. ఆగస్టు 3తో గడువు ముగుస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిగా సర్ ప్రక్రియపైనే దృష్టి పెట్టింది. **తేల్చుకోని డబుల్ ఓటర్లు** హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నివసిస్తున్న వారిలో కొంతమందికి గ్రామాల్లోనూ ఓట్లున్నాయి. అక్కడే ఉంచుకోవాలా? ఇక్కడ కొనసాగించాలా? అనే మీమాంసలో ఉన్నారు. గ్రామాల్లో భూములు, ఇండ్లు ఉన్నవారు అక్కడి జాబితాల్లోనే పేర్లు ఉంచేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. వీరందరికీ నగరంలో ఎన్యూమరేషన్ ఫారాలు అందించగా తిరిగి అప్పగించాలని కోరుతున్నప్పటీ పట్టించుకోవట్లేదు. సంబంధిత బీఎల్‌వోలకు అప్పగించి ఎక్కడ నమోదు చేసుకున్నారో చెబితే ఆ విషయాన్ని 'సర్'లో నమోదు చేస్తామని ఎన్నికల సంఘం చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఫారాల అందజేత కార్యక్రమం నగరాల్లో మందకొడిగా సాగుతోంది. **బూత్‌ల వారీగా డిజిటలైజేషన్...** రాష్ట్ర వ్యాప్తంగా బూత్‌ల వారీగా బీఎల్ఓలు ఓటర్లకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు. ప్రతి రోజు తమకందిన ఎన్యూమరేషన్ ఫారాలను నమోదు ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో నమోదు చేసి వివరాలను పై అధికారులకు నివేదిస్తున్నారు. అందుబాటులో లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, మృతిచెందిన వారి వివరాలను పొందుపర్చి, తొలగింపు జాబితాలో చేరుస్తున్నారు. ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో తిరిగి సమర్పించకపోవడంతో డిజిటలైజేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

# ఎపిలో రోజురోజుకూ పెరుగుతున్న కరోనా కేసులు..

**హైదరాబాద్, జూలై 26:** ఎపిలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. ఇప్పటి వరకూ అందని అధికారిక లెక్కల ప్రకారమే 39 కేసులు నమోదయ్యాయి. అయితే అనధికారికంగా మరికొన్ని కేసులుండవచ్చు. ఎపిలో రోజురోజుకు పెరుగుతున్న కరోనా కేసులు పెరుగుతుండటంతో జనంలో ఆందోళన వ్యక్తమవుతుంది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మరో ఏడు కరోనా కేసులు నమోదు కావడంతో కరో నా వైరస్ వేగంగా విస్తరిస్తుందని వైద్య నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వేరియంట్ అంత ప్రమాదకరం కాదని, భయపడా ల్సిన అవసరం లేదని, అనవసర ఆందోళన చెందవద్దని సూచిస్తున్నారు. ఒమిక్రాన్ వేరియంట్ వైరస్ కావడంతో జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచి స్తున్నారు. ఇక కరోనా వైరస్ వ్యాప్తితో ప్రభుత్వం




అప్రమత్తమయింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. అయితే చాలా మంది ఇన్ పేషెంట్లుగా చేరడం లేదని, హోం ఐసొలేషన్ లో చికిత్స పొందుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ వేరియంట్ అంత ప్రమాదకరం కాదని అంటున్నారు. మృతి చెందిన నలుగురు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారేనని అన్నారు. అయితే దీర్ఘకాలిక రోగులున్న వారు మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలం కావడంతో వైరస్ వేగంగా విజృంభించడానికి అవకాశాలను కొట్టి పారేయలేమని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే బయటకు వెళ్లినప్పుడు విధిగా మాస్క్ లను ధరించాలని, బయట నుంచి వచ్చిన తర్వా త చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచిస్తున్నారు.

## వీర జవాన్ల త్యాగం ఎప్పటికీ స్ఫూర్తిదాయకం: ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

వారు ప్రదర్శించిన సాహసం ప్రతి భారతీయుడికి గర్వకారణం. వారి అచంచలమైన దేశభక్తి, కర్తవ్యనిష్ఠ భావితరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్టతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను' అని పేర్కొన్నారు. కర్నా టకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రిగా ఉన్నారు. ఇక నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

## బాలకృష్ణను పరామర్శించిన బాబు..

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల మోకాలికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా చంద్రబాబు తన బావమరిది అయిన బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ఎంత వేగంగా కోలుకుంటున్నదీ వాకబు చేశారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలకృష్ణకు అందిస్తున్న చికిత్స, తదుపరి పునరావాస ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణుల బృందం పర్య వేక్షణలో ఉన్నారని పేర్కొన్నాయి. మరికొన్ని రోజుల పాటు విశ్రాంతి అవసరమని వైద్య బృందం స్పష్టం చేసిం ది. వైద్యుల సూచనల మేరకు త్వరలోనే బాలకృష్ణ డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సంపూర్ణ ఆరోగ్యంతో బాల కృష్ణ తిరిగి ఇంటికి చేరుకోవాలని, మళ్లీ ఎప్పటి లాగే షూటిం గ్‌లలోనూ, ప్రజా సేవలోనూ వేగంగా పాల్గొనాలని అభిమానులు సామాజిక మాధ్య మాల వేదికగా ఆకాంక్షిస్తున్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్టు తెలిపారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్టు వెంకటరెడ్డి తెలిపారు.

## రానున్న 3 రోజుల్లో తెలంగాణలో విస్తారంగా వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది.

దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43% లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

## ఇది ఆరంభమే...

**న్యూఢిల్లీ, జూలై 26:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ'(సీజేపీ)గత 37 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షను విరమించింది. అనంతరం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆదివారం ఉదయం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు టైఫాయిడ్ సోకడంతో పాటు జ్వరం 101 డిగ్రీలకు చేరడంతో చివరిరోజు నిరసనకారులను వ్యక్తిగతంగా కలువలేకపోయానని, ఇందుకు క్షమించాలని కోరారు. దేశం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ, మద్దతుదారులకూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విమర్శల వల్లే మరింత మెరుగయ్యామని, ఇది ఆరంభం మాత్రమేనని, సీజేపీ ప్రయాణం ముందుకు సాగుతుందన్నారు. సీజేపీ ముఖ్యప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ ఢిల్లీతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు.

## ఆరోగ్య రంగానికి ప్రధాని మోడీ పెద్దపీట: రాంచందర్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జాతీయ భావంతోనే దేశాభివృద్ధి సాధ్యం అని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను కేటాయిస్తోందని ఆయన చెప్పారు. జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలలో అవసరమైన మందులు, పరికరాలు, సిబ్బంది జీతాల వరకు మెజారిటీ నిధులను కేంద్రమే అందిస్తోందని ఆయన తెలిపారు. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ స్వదేశీ వ్యాక్సిన్ రూపొందించడానికి ప్రధాని మోడీ అందించిన ప్రోత్సాహమే కారణమని కొనియాడారు. స్వచ్ఛ భారత్ పరిసరాల పరిశుభ్రతకే కాక 'స్వస్థ భారత్' సాధనకు పునాదిగా నిలిచిందని తెలిపారు. ఖేలో ఇండియా, అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆరోగ్యంపై అవగాహన పెరిగిందన్నారు. సోషల్ మీడియా (వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్)లో వచ్చే అనధికారిక వైద్య సలహాలు, చిట్కాలను నమ్మి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని, తప్పని సరిగా అర్హులైన డాక్టర్ల సలహాలు మాత్రమే పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. **కార్గిల్ యోధుల త్యాగాలు స్మరణీయం:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ సరిహద్దులను కాపాడేందుకు ప్రాణ త్యాగం చేసిన అమర వీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. అంతకు ముందు ఆయన పరేడ్ గ్రౌండ్ ఆవరణలోని స్థూపం వద్ద కార్గిల్ యోధులకు నివాళి అర్పించారు. యువతలో జాతీయ భావం పెంపొందాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్రీయతతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్ వంటి చిన్న దేశాలు శత్రువుల మధ్య ఉన్నప్పటికీ, జాతీయ భావం, పక్కా పరిశోధనలు, సైనిక శిక్షణ, అధునాతన వైద్య విధానాల వల్ల ప్రపంచంలోనే శక్తివంతంగా ఎదిగాయని గుర్తు చేశారు. సోషలిజం, కమ్యూనిజం, క్యాపిటలిజం కంటే 'నేషనలిజం' (రాష్ట్రీయత) ద్వారానే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని రాంచందర్ రావు తెలిపారు. సమాజ ఆరోగ్య రక్షణలో భాగస్వాముల వుతున్న వైద్యులందరికీ రాశీచందర్ రావు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
సోమవారం,
జూలై 27, 2026



## ఎవర్‌గ్రీన్ గ్రామంగా తీర్చిదిద్దుతా వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలగందుల గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన ఎవర్‌గ్రీన్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు దత్తత తీసుకుంటానని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. ఆదివారం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలగందుల బ్రిడ్జి నిర్మాణం, చెరువు సమస్య పరిష్కారం, ముదిరాజ్ సోదరుల ఉపాధి అవకాశాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం ఎదుర్కొన్న అర్హులైన కుటుంబాలకు ఇంటి పట్టాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటూ సేవ చేయడమే తన లక్ష్యమని రాజేందర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, సర్పంచ్ నిమ్మల అంజన్న, ఉపసర్పంచ్ గసికంటి కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వభావపూర్ణతే బాలసాహిత్యానికి భూమిక డా. పత్తిపాక మోహన్



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వభావపూర్ణత ఉన్నప్పుడే బాలసాహిత్యం వర్ధిల్లుతుందని, బాలలకు అందుతుందని నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత అధికారి డా. పత్తిపాక మోహన్ అన్నారు. కరీంనగర్ ఫిలిం భవన్‌లో డా. నలిమెల భాస్కర్ రచించిన పిల్ల తెమ్మెరలు బాలల పాటల పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆనందం, అనుభూతి ప్రధానమైతే ప్రభోదం, నీతి తర్వాత వస్తాయని, బాలసాహిత్యం ఎక్కడైనా ఒక్కటే నని పేర్కొన్నారు. ప్రముఖ బాలసాహితీవేత్తలు వి.ఆర్. శర్మ, గరిపల్లి అశోక్, కూకట్ల తిరుపతి, గజేందర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ భాస్కర్ రచనల్లో మానవతా వాదం, సృజనాత్మకత, భాషా ప్రయోగాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అభినందించారు. రచయిత డా. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే పిల్లల్లో సృజనాత్మకత పెంపొందేలా రచనల ద్వారా కృషి చేస్తున్నానని, మంచి సాహిత్యం ద్వారా పిల్లలు సంపూర్ణ వికాసం సాధిస్తారని తెలిపారు. తన మనవరాలు ఔచిత్య పుస్తక కవర్ డిజైన్ చేయడం ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, సంస్థ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. అనంతాచార్య, కాందూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కవులు, రచయితలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



**ఖానాపూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన విజయాన్ని గుర్తుగా 'విజయ్ దివస్' ఘనంగా నిర్వహించారు. న్యాయవాది నరేంద్రనాథ్ మాట్లాడుతూ, 1999 జూలై 26 భారతీయులు ఎప్పటికీ మరిచిపోలేని రోజు అని, పాక్ కుట్రలను తిప్పికొట్టి దేశ భూభాగాన్ని కాపాడిన జవాన్ల వీరోచిత పోరాటం ప్రపంచానికి భారత సై న్యం సత్తా ఏంటో చాటి చెప్పిందని అన్నారు. భారత సైన్యం దేశానికి అందించిన సేవలకు శిర సు వంచి నివాళులు అర్పిస్తూ, యువకులు, ప్రజలు కలిసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు అవసరం




**ఖానాపూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాత ముద్దం సురేష్‌ను ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ ఘనంగా సన్మానించారు. గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, అన్ని గ్రామాల్లోనూ యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలోనూ ఎల్లమ్మ ఆలయానికి కెమెరాలు ఏర్పాటు చేసిన సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల మల్లేష్, ఉపసర్పంచ్ ఓరగంటి రాజేశ్వర్, గౌడ సంఘం అధ్యక్షుడు గుగ్గిళ్ల సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వాసుదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాసుదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో కట్టారాంపూర్, గౌతమీనగర్, అయోధ్యనగర్, బాబానగర్, వాసుదేవ కాలనీ ప్రాంతాల ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది ప్రజలు వైద్య సేవలు పొందగా, 35 మందికి ఈసీజీ పరీక్షలు, అందరికీ షుగర్ పరీక్షలు చేశారు. ముగ్గురిలో గుండె సమస్యలు, 19 మందిలో కొత్తగా మధుమేహం, 23 మందిలో అధిక రక్తపోటు గుర్తించారు. లబ్ధిదారులకు జూట్ బ్యాగులు, కిచెన్ కిట్లు, మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు శిబిరాన్ని ప్రారంభించగా, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ మందులు పంపిణీ చేశారు. వైద్యులు డా. ఎలగందుల శ్రీనివాస్, డా. బి.ఎస్. రాజు, డా. ఉదయ్, డా. సాయి మేఘన, డా. సాయి ప్రీతమ్, డా. ఆర్.పీ. ప్రసాద్ పాల్గొన్నారు. డా. ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని, వీటి నివారణకు సమతుల్య ఆహారం, వ్యాయామం, సరైన నిద్ర, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి లబ్ధిదారునికి ఒక నెలపాటు ఉచిత ఓపీ సేవలు అందిస్తామని, భవిష్యత్తులో ప్రతి శిబిరంలో ఈసీజీ పరీక్షలు కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. "సర్వేజనాః సుఖినో భవంతు" లక్ష్యంతో వాసుదేవ హాస్పిటల్ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని ప్రకటించారు.

## మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. 2వ డివిజన్ చంద్రపూరి కాలనీ తిలక్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు, 21వ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రాధాన్య క్రమంలో కల్పిస్తూ నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల గకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మే యర్ వై. సునీల్ రావు, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు



**కరీంనగర్/సిరిసిల్ల/ఖానాపూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, ఖానాపూర్ పట్టణాల్లో ఘనంగా వీక్షించారు. కరీంనగర్ నగరంలోని సీతారాంపూర్ సూర్యనగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని, మన్ కీ బాత్ ద్వారా ప్రధాని ప్రజలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ అభివృద్ధి, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, యువత సాధికారత వంటి అంశాలపై చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి బోయిన గోపి పాల్గొన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనను శాలువాతో సన్మానించారు. ఖానాపూర్ పట్టణంలోని 11వ వార్డులో మన్ కీ బాత్ కన్వీనర్ ఎనుగంధుల నారాయణ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జక్కుల సత్తయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ మన్ కీ బాత్ ద్వారా ప్రధాని దేశ అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత సాధికారత, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై విలువైన సందేశాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 136వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 136వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని హుజురాబాద్ పట్టణంలోని పలు బూత్‌లలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగస్ఫూర్తి యువతకు స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. భారత యువత ప్రతిభను కొనియాడుతూ శాస్త్ర సాంకేతిక, ఆవిష్కరణలు, పరిశోధనల రంగాల్లో సాధిస్తున్న విజయాలు దేశ గర్వకారణమని అన్నారు. విద్యార్థులు కొత్త ఆలోచనలు, కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారుల విజయాలను ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు దేశానికి కీర్తి తీసుకొస్తున్నారని అభినందించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని గుర్తుచేస్తూ, స్వదేశీ రక్షణ సాంకేతికతపై ప్రపంచ దేశాల విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని, క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం ద్వారా నీటి వనరులను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు, వార్డు కౌన్సిలర్లు, బూత్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల శ్రమను దోచుకుంటున్న అక్రమ కూరగాయల మొండా

**- అధికారుల నిర్లక్ష్యంతో దళారుల దోపిడీపెరుగుతోంది**
**- ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్**



**ఆమనగల్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న కూరగాయల మొండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోందని ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ట్రేడ్ కమిషన్ లైసెన్స్‌తో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కూరగాయల వేలం ప్రక్రియ ప్రస్తుతం ఎవరి అనుమతితో నిర్వహిస్తున్నారో స్పష్టత లేదని పేర్కొన్నారు. దళారుల ఆధిపత్యం కారణంగా రైతులు తమ కష్టార్జిత పంటకు గిట్టుబాటు ధర పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చట్టం--1966 ప్రకారం స్వల్ప కమిషన్‌తో సాగాల్సిన వ్యాపారం అధికారుల నిర్లక్ష్యంతో అక్రమాల కేంద్రంగా మారిందని విమర్శించారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా మొండా నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారని, కొందరు నాయకులు కూడా అక్రమ నిర్వాహకులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. గత 35 ఏళ్లుగా కూరగాయల రైతుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని, ప్రస్తుతం రైతుల నుంచి 30 నుంచి 50 శాతం వరకు కమిషన్ వసూలు చేస్తూ వారిని, చిన్నచిన్న కూరగాయల వ్యాపారులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఈ భారం చివరకు సామాన్య వినియోగదారులపై పడుతోందన్నారు. గత ఏడాది కాలంగా పాలకవర్గ సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావిస్తున్నప్పటికీ పరిష్కారం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా మొండా నిర్వహిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని తాళ్ల రవీందర్ స్పష్టం చేశారు.

## బోయిన్‌గుట్ట తాండలో భక్తి వెల్లువ

**- వైభవంగా శ్రీ సద్గురు సేవాలాల్ బోగ్ బందార్, సీతల మాత పండుగ వేడుకలు**



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలం బోయిన్‌గుట్ట తాండలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బోగ్ బందార్ మరియు సీతల మాత పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా తాండా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ హాజరై శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్, సీతల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలికోట నరసింహ, 12వ వార్డు సభ్యుడు అంజి నాయక్, సోమ్లా నాయక్, గణేష్ నాయక్, కిషన్ నాయక్, రాములు నాయక్, ఠాగూర్ చంద్రు, శ్రీను, ఈశ్వర్, రవి, సాబీర్, జంగయ్య, హనుమంతు, బాలాజీ, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు.

## ఆపదలో అండగా.. స్నేహబంధం గొప్పతనాన్ని చాటిన పూర్వ విద్యార్థులు

**- కంబాలపల్లి రవీందర్ మృతితో విషాదంలో ఉన్న సహ విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక చేయూత**
**- 2002--03 బ్యాచ్ మిత్రుల మానవీయ స్పందన**



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అకాల మరణంతో కుటుంబ పెద్ద కంబాలపల్లి రవీందర్ను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న తమ సహ విద్యార్థిని రాధిక కుటుంబానికి అండగా నిలుస్తూ కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002--03 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మరోసారి తమ స్నేహబంధం గొప్పతనాన్ని చాటుకున్నారు. ఆదివారం రాధిక నివాసానికి వెళ్లిన మిత్రులు ఆమెతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రవీందర్ మృతితో కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని గుర్తించి, స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇలాంటి కష్టకాలంలో తోటి మిత్రులకు అండగా నిలవడం నిజమైన స్నేహానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. స్నేహం పాఠశాల రోజులకే పరిమితం కాదని, జీవితాంతం ఒకరికొకరు తోడుగా ఉండే బంధమే నిజమైన స్నేహమని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రతి సందర్భంలో సహ విద్యార్థులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ, గోవర్ధన్, మల్లేష్, సదానందం, మహేష్, జంగయ్య, బిక్షపతి, కేశవులు, వెంకటేష్, చంద్రకాంత్, సురేష్, విమలమ్మ, నిట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. మిత్రుల మానవీయ సహకారానికి రాధిక కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

RNI - TELTEL/2023/87644


## అల్ఫోర్స్ పాఠశాలలో విజయవంతంగా ముగిసిన ఖో-ఖో పోటీలు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేస్తాయని, ఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరుస్తాయని అన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ పోటీల్లో గెలుపు దిశగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి టోర్నమెంట్‌కు వన్నె తెచ్చారని ఆయన పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డ్ కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, సీబీఎస్ఈ పరిశీలకులు ఎం. భరత్ కుమార్, భారతీయ మహిళా జట్టు కోచ్ కే. నరేష్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, కోచ్‌లు, మేనేజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా లోకమాన్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం



**ఖానాపూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో లోకమాన్య పరస్పర సహాయక పొదుపు మరియు పరపతి సహకార సంఘం మూడవ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఇప్ప ముత్యం రెడ్డి, సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు యెక్కటి ఉపేందర్ రెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ ముక్క సాయి ప్రసాద్, సంఘ ప్రముఖులు పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు భూసారపు గంగాధర్ మాట్లాడుతూ, మూడు సంవత్సరాల్లోనే 600 మంది సభ్యులతో నాలుగున్నర లక్షల లాభాలను సాధించామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తున్నామని వివరించారు. తరువాత ఎన్నికల అధికారి కందూరి శంకర్ నూతన పాలకవర్గ ఎన్నికలు నిర్వహించారు. చిప్ప ప్రమోద్, శేరే వ్యాస్, మూర్తి అనిత, కుంట అన్నపూర్ణ, దేశ్కర్ భీమ్రావు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వరుసగా నాలుగవసారి అధ్యక్షునిగా భూసారపు గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాజన్ సతీష్ సెక్రటరీగా, అన్నం వాసుదేవరెడ్డి క్యాషియర్‌గా, మైసర్ల వెంకటరమణ జాయింట్ సెక్రటరీగా, జతల శ్రీనివాస్ జాయింట్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్‌లను అందించాలని సిపిఎం డిమాండ్




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ రెండు జతల యూనిఫామ్‌లను వెంటనే అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో యూనిఫామ్‌లు అందజేస్తామని ప్రకటించినప్పటికీ, జూలై నెలాఖరు దగ్గరపడుతున్నా జిల్లాలో అనేక పాఠశాలల్లో ఇప్పటికీ పంపిణీ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 15లోపు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పూర్తి చేయాలని గడువు విధించినా అమలు కాలేదన్నారు. యూని ఫామ్‌ల పంపిణీ ఆలస్యంతో వేలాది మంది విద్యార్థులు పాత దుస్తులతోనే పాఠశాలకు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భిన్నమైన ప్రకటనలు చేయడం వల్ల తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొన్నదని విమర్శించారు. విద్యార్థుల విద్య, క్రమశిక్షణకు యూనిఫామ్‌లు అవసరమని, ప్రభుత్వం ఇకపై జాప్యం చేయకుండా వెంటనే వస్త్రాల సరఫరా పూర్తి చేసి కుట్టింపు పనులను వేగవంతం చేయాలని వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.

## స్మార్ట్ సిటీ పనులపై విచారణ జరపాలని ఆర్పిఐ డిమాండ్




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యత లేక రోడ్లు మొరిలు కొట్టుకుపోయాయని ఆరోపిస్తూ, కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి బ్లాక్‌లిస్టులో పెట్టి జైలుకు పంపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిన కాంట్రాక్టర్ అక్రమంగా బిల్లులు తీసుకున్నారని ఆయన విమర్శించారు. వెంటనే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ విచారణ అధికారిని నియమించి గతంలో జరిగిన పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి సమీక్ష నిర్వహించి రిపోర్టు సమర్పిస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి నగరపాలక సంస్థకు ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విచారణ జరగకపోతే, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, నగర అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గందె కొమురయ్య ముదిరాజ్, ముత్యం అశోక్ రెడ్డి, రామయ్య, బెజ్జంకి అంజయ్య, రామ అశోక్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి, రజక సంఘాల నూతన కమిటీల ఎన్నిక



**కమలాపూర్/జమ్మికుంట, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కమలాపూర్ మండల కేంద్రంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన కమలాపూర్, మర్రిపల్లిగూడెం, గోపాలపురం చేనేత సహకార సంఘ కార్యవర్గ సభ్యులు, మండలంలోని పద్మశాలి సర్పంచులు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు పద్మశాలీలు రాజకీయ రంగంలో మరింత బలోపేతం కావాలని, ప్రజా ప్రతినిధులుగా గెలిచి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యం రాజగోపాల్, నేతన్న టీవీ అధినేత పులికంటి రాజేందర్, జిల్లా నాయకులు, సంఘ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, చేనేత సంఘం మేనేజర్లు పాల్గొన్నారు. అదే రోజు జమ్మికుంట మండల వావిలాల గ్రామంలో రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బొడ్డు ఓదెలు అధ్యక్షుడిగా, కాసర్ల ఓదెలు గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం నివాసంలో వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు ఘన నివాళి



**కరీంనగర్/హుస్నాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ కరీంనగర్, హుస్నాబాద్ పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. హుస్నాబాద్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలు మరవంలేనివని, యువత విద్యార్థులు దేశ సేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. జవాన్లకు పాదాభివందనాలు చేసి రెండు నిమిషాల మౌనం పాటించారు. కరీంనగర్‌లో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు క్యాండిల్ వెలిగించి అమర వీరులకు ఘనంగా నివాళి అర్పించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన వీర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. యువతలో దేశభక్తిని పెంపొందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, సంఘ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు.

## డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం ఎన్నికల నిర్వహణ




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గాలకు ఎన్నికలు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎం. సత్యప్రకాశ్, కార్యదర్శిగా జి. శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా ఏ. రాజశ్రీ, ఉపాధ్యక్షుడిగా టీ. రాజయ్య, స్టేట్ కౌన్సిలర్‌గా బూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక య్యారు. జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా ఎన్. సంగీతారాణి, కార్యదర్శిగా ఏ. శ్రీనివాస్, కోశాధి కారిగా ఈ. రాజకుమార్ ఎన్నికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా జి. శ్రీధర్ రావు, కార్యదర్శిగా ఏ. ప్రసాద్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా జి. పురుషోత్తం, కార్యదర్శిగా సిహెచ్. మారుతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అభ్యర్థులందరికీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కడారు సురేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు.

## వైభవంగా చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో శ్రీ వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచన కర్త, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనను ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ సాదరంగా ఆహ్వానించి పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. సనాతన ధర్మ విశిష్టతను, మానవతా విలువలను తనదైన శైలిలో చాటిచెప్తున్న చాగంటి వారి సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఆధ్యాత్మిక ప్రియులు, సేవా సమితి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవచనాలను ఆస్వాదించారు.

## మోదీ చూపిన మార్గంలో ప్రజాసేవే లక్ష్యం

**- ఆమనగల్లులో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు**



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, యువత పాత్ర, స్వావలంబన వంటి అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన పిలుపు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ గోరటి నర్సింహా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, మున్సిపల్ జనరల్ సెక్రటరీ గోజే ఆనంద్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని సూచించిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు 12 గంటలకూ సరిపడా కరెంటు ఇవ్వక రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. పొలాలు దున్నే సమయంలో కరెంటు అవసరం ఎక్కువగా ఉంటుందని, ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిరంతర సరఫరా చేయడం లేదని వారు ఆరోపించారు. అవసరమైతే పారిశ్రామిక రంగానికి కొంత కోత విధించినా వ్యవసాయానికి నిరంతరంగా కరెంటు ఇవ్వాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్ లాగ్‌బుక్స్ ప్రకారం గత వారం నుండి 12 గంటలకు మించి కరెంటు ఇవ్వలేదని వారు తెలిపారు. రైతులను క్రాప్ హాలిడే ప్రకటించమంటారా అని ప్రశ్నిస్తూ, హామీ ఇచ్చిన విధంగా 24 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలని లేకపోతే సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు వేల్పుల రాజు విక్రమ్, మొగిలి పాక శ్రీనివాస్, జేరిపోతుల రవీందర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి గోరుచిక్కుడు కాయల అలంకరణ



**కరీంనగర్ రూరల్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆషాడమాస శాకంబరీ ఉత్సవాల భాగంగా కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆదివారం అమ్మవారిని గోరుచిక్కుడు కాయల మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ప్రత్యేక అలంకరణతో ఆలయంలో భక్తులు ఘనంగా హారతులు సమర్పించారు.

## అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాల వేడుకలు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ నగరంలో పోచమ్మ తల్లి బోనాల వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. చింతకుంట, కిసాన్ నగర్, శివాజీ నగర్, పసుల నారాయణ కాలనీ ప్రాంతాల్లో భక్తులు అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు స్వయంగా బోనం ఎత్తుకొని ఆలయం చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు కళకళలాడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యకై నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**ఖానాపూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెత్తర్పు గ్రామంలో చాలా కాలంగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడ్డు గంగన్న మాట్లాడుతూ, సమస్యను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారని తెలిపారు. గ్రామ సర్పంచ్ బొడ్డు స్పందన గంగన్న, గ్రామ ప్రజలు ఎమ్మెల్యే బొజ్జు పటేల్, విద్యుత్ శాఖ ఏఈ రామ్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎం వెంకటేష్, ఉపసర్పంచ్‌లు జాడి లక్ష్మి, ఆనంద్, కాంట్రాక్టర్ రాజు నాయక్, ఎఫ్ఏ కమలాకర్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుక రవాణా



**పెద్దపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముత్తారం మండలంలో ఇసుక అక్రమ రవాణా బహిరంగంగా సాగుతుండగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంపల్లి మానేరు నదిపై ఇసుక మాఫియా కన్ను వేసి, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఒక్క అనుమతితో నాలుగు ఐదు లోడ్లు తరలిస్తున్నారని ఆరోపించారు. ట్రాక్టర్లతో పగలు రాత్రి ఇసుక దోపిడీ జరుగుతుండటంతో సహజ వనరులు వేగంగా క్షీణిస్తున్నాయని ప్రజలు తెలిపారు. అనుభవం లేని మైనర్ డ్రైవర్లతో ట్రాక్టర్లు అతి వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా మేల్కొని అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నల్ల మనోహర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో భారీ చేరికలు



**పెద్దపల్లి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దాపూర్ గ్రామ ఎస్సీ కాలనీలో పలువురు యువకులు, గ్రామస్థులు బీజేపీలో చేరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జూలపల్లి మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, రాష్ట్ర నాయకుడు కంకణాల జ్యోతిబసు, స్థానిక సీనియర్ నాయకులు కొత్తగా చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సుమారు 50 మంది పైగా యువకులు, మహిళలు బీజేపీలో చేరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యాలకు ఆకర్షితులై పార్టీకి చేరారని వారు తెలిపారు. రానున్న రోజుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని నల్ల మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల, గ్రామ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సోమవారం,
జూలై 27, 2026



## లైన్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 11 కెవి లైన్ పనుల కారణంగా బ్యాంక్ కాలనీ సబ్‌స్టేషన్ నుండి వచ్చే బ్యాంక్ కాలనీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ పి. శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, తేజ స్కూల్, విద్యాధారి స్కూల్, రెడ్డి ఫంక్షనల్ హాల్, బూత్ బంగ్లా, గుండు హనుమంతుని గుడి ప్రాంతాలు ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మోటార్ల మరమ్మత్తుల కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహమ్మదాపూర్ పంప్ హౌస్‌లో హెచ్‌టీ మోటార్ల మరమ్మత్తు పనుల కారణంగా హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గాల పరిధిలోని కొన్ని మండలాలు, మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోనుంది.జూలై 27 ఉదయం 10 గంటల నుండి జూలై 28 సాయంత్రం 7 గంటల వరకు నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. రామ్‌కుమార్ తెలిపారు.ప్రభావిత ప్రాంతాలు హుస్నాబాద్ మండలం, హుస్నాబాద్ మున్సిపాలిటీ, కోహెడ మండలం, బెజ్జంకి మండలం, గన్నేరువరం మండలం, ఇల్లంతకుంట మండలం, అలాగే భీమదేవరపల్లి మండలంలోని పది గ్రామాలు.ప్రజలు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకోవాలని, తాత్కాలికంగా గ్రామ పంచాయతీ ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించుకోవాలని సూచించారు.

## కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు డివిజన్‌లో జరుగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక కమిటీ బాధ్యులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, అధికారులకు మరియు కాంట్రాక్టర్‌కు నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేసి, డివిజన్ ప్రజలకు త్వరలోనే కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి తీసుకువస్తామని సునీల్ రావు తెలిపారు.

## పెద్దమ్మ తల్లి ఆలయానికి భారీ విరాళం



**రామడుగు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామడుగు గ్రామంలోని ముదిరాజ్ కులస్థుల ఆరాధ్యదైవమైన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రెనే హాస్పిటల్ గ్రూప్స్ చైర్మన్ డా. బంగారు స్వామి రూ.2 లక్షల విరాళం అందించారు.తన తల్లి బంగారు లక్ష్మి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని సమర్పించిన ఆయన భవిష్యత్తులో కూడా ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహీజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి అభ్యర్థన మేరకు ఈ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన డా. బంగారు స్వామి, సర్పంచ్ మొహీజ్, మామిడి తిరుపతికి ముదిరాజ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వెలమ సంఘం సమావేశంలో యాదగిరి సునీల్‌రావుకు ఘన సత్కారం



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పద్మనాయక కళ్యాణ మండపంలో జరిగిన పద్మనాయక వెలమ సంఘం సర్వసభ్య సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును ఘనంగా సత్కరించారు.డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా సంఘ అధ్యక్షుడు హనుమ ంతరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శాలువా కప్పి సన్మానం చేశారు. ప్రజా సేవలో మరిన్ని విజ యాలు సాధించాలని, వెలమ వర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని సంఘ ప్రతినిధులు ఆకాం క్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కరీం నగర్ డెయిల్ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నమనేని సుధాకర్‌రావు, సర్పంచులు, కార్పొరేటర్లు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణలో బిఎల్‌ఏ-2ల పాత్ర కీలకం అంటోని రెడ్డి



**సుల్తానాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బిఎల్‌ఏ-2ల సమావేశంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ అంటోని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో బిఎల్‌ఏ-2ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్లను నమోదు చేయించడం, తప్పులను సరిదిద్దడం, ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, బిఎల్‌ఏ-1 బెజ్జంకి దిలీప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కాసాగోని నిర్మల, జిల్లా కోశాధికారి కామని రాజేంద్ర ప్రసాద్, మండల పదాధికారులు, బిఎల్‌ఏ-2లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దావ లాలయ్యకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘన నివాళి

**- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన దావ లాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమం ఆదివారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై దావ లాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. లాలయ్య సమాజంలో అందరితో స్నేహపూర్వకంగా మెలిగిన వ్యక్తిగా గుర్తుండిపోతారని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని, ప్రజాప్రతినిధిగా తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీపాల్, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్, ధనుంజయ, గాజుల మల్లయ్య, మెకానిక్ బాబా, దేవరశెట్టి మహేష్, రాకేష్, గాజుల శేఖర్, మేఘం వెంకటయ్య, తాళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఊరటగా విత్తన మేళా

**- జూలై 27 నుంచి 29 వరకు ఆమనగల్ రైతు వేదికలో నిర్వహణ**
**- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందుబాటులో**



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆమనగల్ రైతు వేదికలో జూలై 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తగినంత వర్షపాతం లేకపోవడంతో సంప్రదాయ పంటల సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, తక్కువ నీటి వసతితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ విత్తన మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేళాలో రైతులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కందులు, పెసర, మినుములు, ఆముదాలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలతో పాటు వివిధ రకాల కూరగాయల విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ పంటలు తక్కువ నీటితో సాగు చేయడానికి అనుకూలంగా ఉండటంతో పాటు తక్కువ కాల వ్యవధిలోనే మంచి దిగుబడిని అందించే సామర్థ్యం కలిగి ఉంటాయని పేరొన్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, సాగు పద్ధతులు, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టాలను తగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు ఉత్తమ మార్గమని సూచించారు. ఆమనగల్, మాడ్గుల్, కడ్తాల్, తలకొండపల్లి మండలాల రైతులు ఈ విత్తన మేళాకు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ నిపుణుల సూచనలు తెలుసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఓటరు అవగాహన శిబిరం



**ఎల్బీనగర్, జులై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా , తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్ ఆగిరి వెంకటేష్ గుప్తా గారి సూచనల మేరకు, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్‌లో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) పై అవగాహన శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ శిబిరంలో ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యత, ఎస్ఐఆర్ ప్రక్రియ, దరఖాస్తు విధానం, అవసరమైన ధృవీకరణ పత్రాలు, నమోదు మరియు సవరణ ప్రక్రియలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ వేమారెడ్డి , బీఎల్ఓ సుమతి , బీఎల్ఓ హమీద్ , కొత్త రవి రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్ పాల్గొని ప్రజలకు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై విలువైన సూచనలు, సలహాలు అందించారు. అలాగే ఆర్యవైశ్య మహాసభ సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భవన నిర్మాణ సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు



**దామరచర్ల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**నరసాపురం గ్రామపంచాయతీలో ఆదివారం భవన నిర్మాణ సంఘం గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడిగా ఎం. మహేష్, కార్యదర్శిగా బి. రాజు, సహాయ కార్యదర్శిగా ఎం. రాజయ్య, కోశాధికారిగా చిన్నను ఎన్నుకోగా, ఇతర సభ్యులను కూడా కమిటీలో చేర్చారు.సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ మాట్లాడుతూ, "భవన నిర్మాణ కార్మికులందరూ వెల్ఫేర్ బోర్డు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి. కార్మికులకు సంక్షేమ పథకాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వృద్ధాప్యంలో ఉన్న కార్మికులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇవ్వాలి. ఇల్లు లేని కార్మికులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి" అని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నో త్యాగాలతో సాధించిన చట్టాన్ని ప్రైవేటు వ్యక్తులకు, ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. సీఎస్ఐని వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 12ను రద్దు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకుడు పాపన్నయ్య పాల్గొని కార్మిక సం ఘం బలోపేతానికి తన మద్దతు తెలిపారు. గ్రామస్థులు, కార్మి కులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

## ఆగస్టు 23న బోడుప్పల్లో బోనాల పండుగ

**- గ్రామ పెద్దల సమావేశంలో నిర్ణయం**



**బోడుప్పల్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**బోడుప్పల్ గ్రామ పెద్దలు ఆదివారం శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో సమావేశమై, వచ్చే నెల ఆగస్టు 23న బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు చిప్పల శోభరాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, "బంగారు మైసమ్మ తల్లి గ్రామ ప్రజలకు కొంగుబంగారంగా నిలుస్తుంది. ప్రతి సంవత్సరం అత్యంత పవిత్రంగా భావించే ఈ బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు" అని తెలిపారు.యువకులు సంప్రదాయ పద్ధతిలో ఫలహారం బండ్ల ఊరేగింపులు నిర్వహిస్తారని, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని ఆయన వివరించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ నగర అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ పోగుల నర్సింహ రెడ్డి, బీజేపీ నగర అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్ యాదవ్, బుక్క సుమన్, గుర్రాల వెంకటేశ్ యాదవ్, జాడిగె మహేందర్ యాదవ్, బొమ్మక్ శ్రవణ్ కుమార్, బొమ్మక్ విశ్వనాథ్, బొమ్మక్ శ్రీను, తోటకూర రవీందర్ యాదవ్, పొన్నం రవి గౌడ్, బంధారం నాగేష్ గౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు చిప్పల సాయి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



**వెల్దండ, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**వెల్దండ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరాన్ని యెన్నమ్స్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసి, ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మారుతున్న జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గిస్తాయి" అని పేర్కొన్నారు.శిబిరంలో దాదాపు 550 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు యెన్నం భూపతి రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ యెన్నం అంజన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఎముకల నిపుణుడు డాక్టర్ వెంకటేష్, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు, జనరల్ మెడిసిన్ డాక్టర్ దినేష్ కుమార్, స్త్రీల ప్రత్యేక వైద్యురాలు డాక్టర్ శ్రీవాస్తవి, డీఎంఓ అభిషేక్, జనరల్ మేనేజర్ కె. రవి కుమార్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాలాది మల్లీశ్వరి, రంగనాథం, గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీనివాస్, మసిగుండ్ల వెంకటేష్, మట్ట భరత్ గౌడ్, జంగిలి ఆనంద్ రాజ్, గోరటి భరత్, సమీర్, శేఖర్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీఓ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే



మిర్యాలగూడ, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మిర్యాలగూడ మండలంలోని దీరావత్ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) మహిళా సంఘం భవనాన్ని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఈ వీఓ భవనం ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, సంఘాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. మహిళలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు .అనంతరం గ్రామ ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్--చిల్కనగర్ రహదారిపై గుంతల పరిశీలన



బోడుప్పల్/చిల్కనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):చిల్కనగర్ నుండి బోడుప్పల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుండగా, పదుల సంఖ్యలో వాహనాలు గుంతల్లో పడిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితిని పరిశీలించిన మాస శేఖర్ సంబంధిత అధికారులను వెంటనే స్పందించి రహదారి గుంతలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, రహదారి సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్బు బాయ్, నక్క సురేందర్, బెల్క మహేందర్, అవినాష్ యాదవ్, శ్యామ్, ఎర్ర నరేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# "నా నేస్తం" సేవలకు సెల్యూట్



ఎలిగేడు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎలిగేడు మండల ప్రతిష్ఠను జిల్లా వ్యాప్తంగా పెంపొందిస్తున్న నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ సేవలను సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మధుకర్ ప్రశంసించారు. ఆదివారం ఎలిగేడు పోలీస్ స్టేషన్‌కు ట్రస్ట్ తరఫున ఇరవై వేల రూపాయల విలువైన మైక్ సెట్ అందజేయగా, ప్రజలకు గ్రామాల్లో తగిన సూచనలు, సమాచారం అందించడానికి ఇది ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. గత 13 ఏళ్లుగా మండలంలో వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్, ఉచిత కంప్యూటర్ శిక్షణ, డ్రైవింగ్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ట్రస్ట్ నిస్వార్థ సేవలు అందిస్తున్నదని ఎస్ఐ మధుకర్ కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ మాట్లాడుతూ, "1988లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరం కలిసి 'నా నేస్తం' ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, విద్య--వైద్య రంగాలను ప్రధానంగా ఎంచుకొని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. త్వరలో మండలంలోని మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించాలనే సంకల్పం ఉంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు తానిపర్తి సుధాకర్ రావు, వెంగళదాస్ అశోక్, ట్రస్ట్ బాధ్యులు బూర్ల రాజేశం, రంగు వీరస్వామి గౌడ్, తీట్ల రమేష్ శ్రీనివాస్, కట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలి



ఎలిగేడు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎస్ఐఆర్ కార్యక్రమంలో మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా చూడాలని బీజేపీ ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జీ అంథోని రెడ్డి, పెద్దపల్లి అసెంబ్లీ కోఆర్డినేటర్ గొట్టెముక్కుల సురేశ్‌రెడ్డి సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని స్థానిక మధుర ఫంక్షన్ హాల్లో ఆదివారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి అధ్యక్షతన బూత్ వారీగా బీఎల్ఎలు, టోలి టీమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీఎల్ఎ--టోలి సభ్యులకు ఎస్ఐఆర్ సంబంధిత పూర్తి సమాచారం అందించి, దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎ--1 బెజ్జంకి దిలీప్, మండల ఇంచార్జీ తీగల అశోక్, అలాగే బీఎల్ఎ--2లు అడ్డగుంట తిరుపతి గౌడ్, భోగె కిరణ్, కోడూరి శ్రీనివాస్, ఇల్లందుల పరుశరాములు గౌడ్, రాకేశ్, సుమన్, మల్లారపు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, అంజయ్య, అమరగొండ గంగయ్య, ఎర్ర మల్లేశం, మెండె సాగర్, భూసారపు తిలక్, ఆసంపల్లి రవీందర్, కోట కనకయ్య, రంగు మణికంఠ, క్యాతం మహేందర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు స్పష్టం చేస్తూ, "ఎస్ఐఆర్ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలి. ఎవరి ఓటు కూడా పోకుండా చూసుకోవాలి" అని తెలిపారు.

## రూ.డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు



ఎలిగేడు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి శివాలయం నుండి ముప్పిరి తోట, ధూళికట్ట వరకు రూ.12 కోట్ల నిధులతో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారి సౌకర్యాలు అత్యంత కీలకం. ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించేందుకు, వాణిజ్య--వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ డబుల్ రోడ్డు పనులు దోహదపడతాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు కల్వకుర్తికి ఎమ్మెల్యే పర్యటన



కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవ కార్యక్రవ ంలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నాం ాయణరెడ్డి పాల్గొననున్నారు. ఈ విషయాన్ని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు. యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న ఎమ్మెల్యే రాక సందర్భంగా కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

# కల్వకుర్తి యాగానికి కలెక్టర్‌కు ఆహ్వానం




కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ను యాగ నిర్వాహకులు ఆహ్వానించారు. శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యాగ కార్యక్రమానికి కలెక్టర్‌ను ఆహ్వానిస్తూ, నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జూలూరి రమేష్ బాబు, తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బీచాని బాలకృష్ణ నేతృత్వంలో శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అదే విధంగా సివిల్ సప్లై డీఎం, డిటి అధికారులకు కూడా ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాగ కమిటీ సభ్యులు మాచిపెద్ది రామస్వామి, ఎన్మానగండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# యాగ నిర్వాహకులకు పోల రాజేందర్ విరాళం



కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవానికి స్థానిక రాఘవేంద్ర రైస్ మిల్ యజమాని పోల రాజేందర్ తన వంతు సహాయంగా రూ.51,000 విరాళం అందజేశారు. భక్తి శ్రద్ధల నడుమ భారీ ఎత్తున కొనసాగుతున్న యాగ కార్యక్రమానికి దాతల సహకారం ఎంతో ప్రాధాన్యత కలిగిందని యాగ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మహోత్సవం విజయవంతం కావడానికి ప్రజలతో పాటు దాతల సహకారం కూడా కీలకమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో యాగ కమిటీ సభ్యులు కల్వ రమేష్, పాపిశెట్టి శ్రీను, గంప వెంకటేష్, సంబు ముత్యాలు, పాపిశెట్టి రవి, కల్వ హరికృష్ణ, శంకర్, అప్పాయిల్లి శ్రీను, మాచిపెద్ది అశోక్, దాచేపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం శివారాధన.. సుర సముద్రం వద్ద ప్రత్యేక పూజలు



ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రముఖ సంఘసేవకులు, అరవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆదివారం ఆమనగల్లు పట్టణంలోని సుర సముద్రం వద్ద శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి దిగుబడులు రావాలని, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం భక్తులతో కలిసి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వర్షాలు కురవాలని వేడుకున్నారు. కార్యక్ర మంలో చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, వడ్డేమోని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎల్ శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రజాసేవా దృక్పథం, పార్టీ పట్ల ఆయన అంకితభావం, ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సామాజిక సేవలో ముందుండే నాయకుడిగా సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని అభిలషిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేరంగుల వెంకటేష్, వరికుప్పల గణేష్, మహేష్ నేత, లండం యాదయ్య, రాముల మహేష్, శ్రీధర్, దేరంగుల చిన్న, శివచారి, ఎలె సాయి తదితరులు పాల్గొని సిఎల్ శ్రీ నివాస్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## దారి మైసమ్మ తల్లికి ఆషాఢ మాసం ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాఢ మాసం సందర్భంగా సుల్తానాబాద్ కారు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇరుకుల్ల, బసంత్‌నగర్ దారి మైసమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారు యజమానులు, డ్రైవర్లు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించి వాహనాలు సురక్షితంగా నడవాలని, డ్రైవర్లు, ప్రయాణికులు క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కారు అసో సియేషన్ సభ్యులు, కార్ ఓనర్లు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.

## అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాల వేడుకలు



హుస్నాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత--రాజు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. శివసత్తులు, పోతరాజులు డప్పు చప్పుళ్లతో ఆటపాటల మధ్య నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు. ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు బోనం సమర్పించడం వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతుల పంటలు కళకళలాడాలని కోరుకునే సాంప్రదాయ పండుగగా సర్పంచ్ పేర్కొన్నారు. యాదృచ్ఛికంగా వెంటనే వర్షం కురవడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్, నాయకులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 100శాతం సర్ కార్యక్రమం పూర్తి చేసిన బిఎల్వోకు ఘన సన్మానం



హుజురాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో 287వ బూత్‌లో 100శాతం సర్ కార్యక్రమం పూర్తి చేసిన బిఎల్వో కుమ్మరి కోమాలను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తౌటం మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు ఆదేశాలతో కమలాపూర్ మండలంలో బిఎల్ఏల సహకారంతో కార్యక్రమం చురుగ్గా సాగుతోందని, త్వరలో అన్ని బూతుల్లో 100శాతం పూర్తి చేస్తామని తెలిపారు. గూడూరులో కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు పాక చంద్రమౌళి, భాష బోయిన రమేష్, గాలిబు నవీన్, కొండపాక మనీష్, గాలిబు శంకర్, శివానందం తదితరులకు అభినందనలు తెలిపారు.

# రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ విత్తన మేళా

కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో సోమ, మంగళ, బుధ వారాల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహిస్తున్నారు. ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు చిరుధాన్యాలు, అపరాలు, నువ్వులు, ఆముదం, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితో సాగు చేయడానికి అనుకూలంగా ఉండి రైతులకు లాభదాయకమని అధికారులు తెలిపారు.

## ఇబ్రహీంపట్నంలో వైభవంగా ఉప్పలమ్మ బోనాలు



ఇబ్రహీంపట్నం, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):యాచారం మండలం మేడిపల్లి నక్కర్త, తక్కల్లపల్లి ఎస్ఆర్చైచ్ ఫోల్ట్రీ ఫామ్లో ఆదివారం ఉప్పలమ్మ అమ్మవారికి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఫోల్ట్రీ ఫామ్ యాజమాన్యం ఆధ్వర్యంలో మహిళలు తలపై బోనాలను ఎత్తుకొని డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పి ంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది ఈ పండుగను నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌చార్జీలు సుమన్ రెడ్డి, మల్లేష్, సురేష్, ఫోల్ట్రీ ఫామ్ మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



మిర్యాలగూడ, జూలై 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్):సామేగాని తండా గ్రామంలో గిరిజన సంప్రదాయాన్ని ప్రతిబింబించే తీజ్ పండుగ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని గిరిజన మహిళలకు, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు, యువతతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, "ప్రజలతో అనుబంధమే తనకు అతిపెద్ద బలం" అని పేర్కొన్నారు. గిరిజన సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే తీజ్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామం ఆధ్యాత్మిక--సాంస్కృతిక వాతావరణంతో కళకళలాడింది. మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి తీజ్ పండుగను వైభవంగా జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, మాజీ సర్పంచ్ ధనావత్ సైదా నాయక్, కురువ నాయక్, సురేష్, రమేష్, బాల, బాలు, రవి నాయక్, యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవంతంగా ఏఐటీయూసీ జిల్లా 3వ మహాసభలు

**తాడూర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తాడూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా 3వ మహాసభలు ఘనంగా జరిగాయి. కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఈ మహాసభల్లో జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన కార్మికులు ఎర్రజెండాలతో, నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తాడూర్ ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీ సభా ప్రాంగణానికి చేరుకుని, "లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి, కనీస వేతనం రూ.26 వేలుగా ఇవ్వాలి" అంటూ నినాదాలు మార్మోగాయి. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు యం. బాలనర్సింహ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం. నర్సింహ వివిధ



రంగాల కార్మికులు ఏఐటీయూసీ జెండా కింద ఏకమవాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఇన్సెంటీవ్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు సకాలంలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీ కార్మిక సంఘం కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, పనిఒత్తిడి, తక్కువ వేతనాలు, రక్షణ పరికరాల లేమిపై ప్రభుత్వం స్పందించాలని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక సంఘం ఏఐటీయూసీ అని, నాటి నుండి నేటి వరకు కార్మిక వర్గం పక్షాన నిలబడి హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. సభలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆన్ డ్యూటీ ప్రమాదాలకు పూర్తి వైద్య సదుపాయం, ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని, స్మార్ట్ మీటర్లు, టెండర్ విధానాలతో ఉపాధి కోల్పోతున్న కార్మికులను ఆదుకోవాలని, కార్మిక వ్యతిరేక నిబంధనలు మరియు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని తీర్మానాలు ఆమోదించారు. ఈ మహాసభలు కార్మికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, రాబోయే ఉద్యమాలకు దిశానిర్దేశం చేశాయని నాయకులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# నంద్యాల జల సంరక్షణకు ప్రధాని ప్రశంసలు

**నంద్యాల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో 'క్యాచ్ ది రైన్' ప్రచారం కింద నంద్యాల జిల్లా చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రశంసించారు. ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగానికి గర్వకారణమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ప్రధానమంత్రి పేర్కొన్నట్లుగా, జిల్లాలో సంప్రదాయ చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల పూడికతీత, జల సంరక్షణ నిర్మాణాల బలోపేతం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను శాస్త్రీయ ప్రణాళికతో విజయవంతంగా అమలు చేయడం ద్వారా నంద్యాల జిల్లా దేశానికి ఆదర్శంగా ని లిచింది. జిల్లాలో ఇప్పటివరకు 2,103 జల సంరక్షణ పనులు, 2,691 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పునరుద్ధరణ, 251 చెరువుల అభివృద్ధి, 22,221 ఫార్మ్‌పాండ్లు, 2,221 చెక్‌డ్యామ్‌లు, 202 పర్కొలేషన్ ట్యాంకులు బలోపేతం చేయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాల పునరుత్పత్తి గణనీయంగా పెరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ చర్యల ఫలితంగా



వ్యవసాయం, తాగునీటి భద్రత, గ్రామీణ జీవనోపాధికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతున్నాయని ఆమె తెలిపారు. ప్రధాని ప్రశంసలు జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజల సమిష్టి కృషికి దక్కిన జాతీయ గుర్తింపని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి జిల్లా ప్రతిష్ఠను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్‌ను గెలిపించండి

**నల్లగొండ, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్టీసీ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలను కొనసాగిస్తున్న లిస్టెడ్ ఓ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్)ను ఆదరించి రాబోయే ఆర్టీసీ ఎన్నికల్లో గెలిపించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ డిపోలో జరిగిన కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "సంఘం ఆవిర్భావం నుండి నేటి వరకు కార్మికుల హక్కుల రక్షణ కోసం, ఆర్టీసీ పరిరక్షణ కోసం అనేక ఐక్య పోరాటాలు చేశాం. కార్మికుల పట్ల చిత్తశుద్ధితో ముందుకు పోతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్‌కు కార్మిక వర్గం అండగా నిలవాలి" అని అన్నారు. ఐదేళ్ల క్రితం సమ్మెల్లో ప్రభుత్వం, యాజమాన్యంతో జరిగిన చర్చల్లో ఉద్యోగ భద్రత, ఆర్టీసీ కార్మికుల విలీనం వంటి అంశాలను ప్రస్తావించామని, రెగ్యులేషన్లో మార్పులు చేసి ఉద్యోగ భద్రతకు ఆటంకాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్న ఏకైక సంఘం ఎస్‌డబ్ల్యుఎఫ్ అని ఆయన స్పష్టం చేశారు. రెండు నెలలు కావస్తున్నా ఈడీ కమిటీలతో అంశాలు అమలు చేయకపోవడంతో మళ్లీ పోరాటం తప్పదని అన్నారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని, జూనియర్ అసిస్టెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన కార్మికులకు వెంటనే



పోస్టింగులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 నుండి యూనియన్ కార్యకలాపాలకు అనుమతి లేకున్నా కూడా కార్మికులకు వెన్నంటే ఉంటూ వారి కష్టాల్లో అండగా నిలిచిందని ఎస్‌డబ్ల్యుఎఫ్ మాత్రమేనని ఆయన గుర్తుచేశారు. విలీన ప్రక్రియలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో కార్మిక వర్గం ఐక్యత కోసం, హక్కుల సాధన కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కే.ఎస్. రెడ్డి, రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, కోశాధికారి బైరు శ్రీకాంత్, సిఐటియు జిల్లా కార్యదర్శి సలీం, జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట్ రవీందర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు యం.సి. మౌళి, నరసింహయ్య, గద్దర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా హక్కుల సాధనే లక్ష్యంగా సిపిఐ ఎంఎల్ ఉద్యమాలు

**నందికొట్కూరు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఏఐపిడబ్ల్యుఏ) ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం నందికొట్కూరు పట్టణంలో జరిగింది. జిల్లా నాయకురాలు షేక్ బీబీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఆర్. నాగమణి, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, ప్రముఖ సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, "మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అణచివేతలు, హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు ఏఐపిడబ్ల్యుఏ మహిళలకు భూమి హక్కులు, సమాన పనికి సమాన వేతనం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబనే ప్రధాన లక్ష్యంగా ఉద్యమిస్తోంది" అని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు మహిళలను సంఘటితం చేసి హక్కుల సాధన కోసం పోరాటాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శితో



పాటు 10 మంది సభ్యులతో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. మహిళా హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం, మహిళలపై హింస నిరోధం, ఉపాధి అవకాశాల విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కొత్త కమిటీ మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నందికొట్కూరు మండల కార్యదర్శి కాటేపోగు సోమన్న, వడ్డే శ్రీరాములు, ఎస్. సలీం, భాష మహబూబ్ బాషా, మహిళా నాయకులు ఎం. శిరీష, తహరాబీ, వై. నాగమణి, ఎస్. ముత్తు, జాబి సుబ్బమ్మ, సుజాత, వడ్డే మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాల ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**నల్లగొండ, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి--యువజన సంఘాలు చేసిన సమరశీల పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, ఇది ప్రజాస్వామ్య శక్తుల విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా విక్రయిస్తోంది. విద్యుత్ సంస్కరణలు, నాలుగు లేబర్ కోడ్స్, వ్యవసాయ నల్ల చట్టాలను దొంగచాటుగా తీసుకొచ్చింది. రైతాంగం చేసిన పోరాటాల ఫలితంగా మోదీ వెనక్కి తగ్గారు" అని గుర్తుచేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. బాధిత



కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జీలు చేసి కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఎండిపోతే తాగునీటి ఎద్దడి తలెత్తుతుందని హెచ్చరించారు. కృష్ణ--గోదావరి నదుల వాటా కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, రైతు సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితుల దృష్ట్యా కర్షకుల ప్రభుత్వంతో చర్చించి ఎంఎంఆర్పీ, నాగార్జునసాగర్ కాలువలకు నీటి విడుదల కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై సమరశీల పోరాటాలు తప్పవని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బీకార్ మల్లేశం, బంధా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చిన ప్పాక లక్ష్మీనారాయణ, వి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో ఆదుకోవాలి

**నందికొట్కూరు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రాభివృద్ధి కోసం తమ వ్యవసాయ భూములను త్యాగం చేసిన మల్మల్లి మాన వతా దృక్పథంతో ఆదుకోవాల్సిందిపోయి మం జాల వైపు నడిపించడం హేయమైనదని నాయకులు తగదని ముంపు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. నందికొట్కూరు పట్టణంలో 123 రోజులుగా జీవో 98 బాధితులు దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితుడు జయన్న మాట్లాడుతూ, "మా నిరీక్షణ ఫలించే వరకు పోరాడుతాం. తక్షణమే జీవో 98 ప్రకారం మాకు ఉద్యోగాలు ఇవ్వాలి. లేకపోతే ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలను సంఘటితం చేసి స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం" అని హెచ్చరించారు. ప్రభుత్వం



పట్టించుకోవడంలేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన బాధితులు, తమ త్యాగాలను గుర్తించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ దీక్షల్లో నాగేంద్ర, చిన్న సుబ్బయ్య, రామకృష్ణ, నాగసుంకన్న, నాగరాజు, మౌలాలి, వెంకటేశ్వర్లు, జమ్మన్న, సామేల్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

# చెరువుగట్టులో అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం

**నల్లగొండ, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చెరువుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గుట్ట కింద ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మొదటగా మంటలు చెలరేగి, గాలుల ధాటికి క్షణాల్లోనే పక్కనే ఉన్న ఇతర షాపులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మొత్తం 20 వ్యాపార దుకాణాలు, 20 తోపుడు బండ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల తీవ్రతకు దుకాణాల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు వరుసగా పేలిపోవడంతో ఆ ప్రాంతమంతా భయాందోళనకు గురైంది. సమీపంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి కూడా మంటలు అంటుకోవడంతో ముఖ్యమైన



ప్రభుత్వ దస్త్రాలు, రికార్డులు కాలిపోయాయి. సుమారు రూ.3 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానిక సర్పంచ్ తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం అర్ధరాత్రి వేళ జరగడంతో దుకాణాల్లో ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటన స్థలానికి చేరుకుని దగ్ధమైన దుకాణాలను పరిశీలించారు. నష్టపోయిన 20కి పైగా చిన్న దుకాణాల యజమానులను పరామర్శించి, ఒక్కొక్కరికి తక్షణ సాయంగా రూ.20 వేల నగదు సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయంపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# శ్రీశైలం శైవక్షేత్రంలో భక్తుల రద్దీ





**శ్రీశైలం, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీశైలంలో ఆదివారం భక్తులు భారీగా పోటెత్తారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా భక్తులు తరలివచ్చారు. రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు నుండి ఐదు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల కోసం తాగునీరు, అల్పాహారం నిరంతరంగా అందించారు. ముఖ్యంగా భక్తుల రద్దీని నియంత్రించడానికి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడానికి పోలీసు సిబ్బంది, దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉదయాన్నే పాతాళగంగ వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి అలంకార దర్శనం చేసుకున్నారు.

# బంజారా సంస్కృతికి అద్దం పట్టిన బోయిన్‌గుట్ట తండా వేడుకలు

- సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్, సీతల మాత పండుగ ఘనంగా నిర్వహణ
- గుడి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలం సరికొండ గ్రామ పరిధిలోని బోయిన్‌గుట్ట తండాలో బంజారా సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు ప్రతిబింబించేలా నిలిచే శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్, సీతల మాత పండుగతో పాటు మేరమా యాడి గుడి భూమి పూజ ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో తండా ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, సంప్రదాయ ఆచారాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సేవాలాల్ మహారాజ్, సీతల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు సమాజానికి గొప్ప వారసత్వమని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు



అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూర్ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, మాజీ అధ్యక్షుడు బిచ్చా నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదుతల యాదయ్య, ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నాయక్, మైసిగండి సర్పంచ్ ప్రేమ్ జవహర్లాల్ నాయక్, కర్కులపహడ్ సర్పంచ్ తేజు నాయక్, ఎక్వాయిపల్లి సర్పంచ్ కర్ణాకర్ గౌడ్, కడ్తాల్ ఉపసర్పంచ్ ఈ. రెడ్డి యాదగిరి రెడ్డి, మైసిగండి ఉపసర్పంచ్ హీరాసింగ్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సరికొండ బోయిన్‌గుట్ట తండా సర్పంచ్ అర్జాల మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ బలవంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అర్జాల రాములు గౌడ్, గౌని లక్ష్మయ్య, పార్టీ అధ్యక్షుడు రౌతు వెంకటయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై పండుగను విజయవంతం చేశారు. సంప్రదాయ బంజారా ఆచారాలు, భక్తి కార్యక్రమాలు, సామూహిక ప్రార్థనలతో బోయిన్‌గుట్ట తండా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

# జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



**నంద్యాల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారిని సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తి సృష్టి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధి గురించి ఆరా తీశారు. "మీపై నిరంతరం నిఘా ఉంటుంది. పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని అధికారులు హెచ్చరించారు.

# గడివేములలో ఉచిత వైద్య శిబిరం




**గడివేముల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామంలో నంద్యాల ఇండస్ గుండె హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామ ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, రక్తపరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇండస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వంగాల మనోహర్ రెడ్డి, డాక్టర్ నాగార్జున, గ్రామ నాయకులు ఎస్.ఏ. ఫారుక్, ఎఫ్. నజీర్ అహ్మద్, ఆర్గనైజర్ సి. శివుడు, షేక్ ఆజం, పి. జయంత్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, కె. పాపడు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పంటలను పరిశీలించిన సిపిఐ(ఎంఎల్) నాయకులు



**గడివేముల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**గడివేముల మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో మెట్ట రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం పంట పొలాలను పరిశీలించిన అనంతరం తెలిపారు.2026 ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాలపై ఆధారపడి మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పెసర, కంది పంటలకు అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేశారని, అయితే వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పంట నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, అలాగే ప్రైవేట్ అప్పుల భారాన్ని తగ్గించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఇస్మాయిల్, షేక్ హుస్సేన్, నాగరాజు, షేక్ సావిదా, కాంతారావు, ప్రవీణ్ కుమార్, కిరణ్ బాబు, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రేన్ ఢీకొని యువకుడు మృతి



**కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కల్వకుర్తి పట్టణంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వంగూరు మండలం కోనేటిపురం గ్రామానికి చెందిన సాయి కుమార్ (27) మృతి చెందాడు.తన పనులు ముగించుకొని బైక్‌పై వంగూరు నుండి కల్వకుర్తికి తిరిగి వస్తుండగా, పట్టణంలోని కన్యాకాపరమేశ్వరి కమాన్ వద్ద ఆగి ఉన్న క్రేన్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.మృతుడి తల్లి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ, “క్రేన్ యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగింది. వాహనానికి టిప్పర్ లైట్లు వేయకపోవడం వల్లే నా కుమారుడు మృతి చెందాడు” అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కల్వకుర్తి ఎస్‌ఐ సుగూరు కురుమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, “రాత్రి వేళల్లో రోడ్లపై ఆగి ఉన్న వాహనాలకు తప్పనిసరిగా టిప్పర్ లైట్లు వేయాలి. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.మృతుడు సాయి కుమార్ వంగూరు మండలం కోనేటిపురం గ్రామానికి చెందినవాడు. కల్వకుర్తి పట్టణంలో నివాసం ఉండి గోల్డ్‌స్మిత్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ ఘటనతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వియత్నాం ప్రమాదంలో గాయపడ్డ కిషోర్ కోలుకోవడం సంతోషం

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి / విజయవాడ, జూలై 26 :** వియత్నాం సముద్ర తీరంలో ఈ నెల 11న జరిగిన బోటు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆ దేశంలో చికిత్స పొందుతోన్న గెల్లి కిషోర్ ఆరోగ్యంతో కోలుకోవడం సంతోషకరం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోటు ప్రమాదంలో చిక్కుకున్న 30 మంది తెలుగు పర్యాటకులు సురక్షితంగా స్వగ్రామాలకు చేరుకున్నారని.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురి భౌతికకాయాలను భారత రాయబార కార్యాలయం, వియత్నాం ప్రభుత్వం, స్థానిక తెలుగు సంఘాలు, ఏపీ భవన్ సమన్వయంతో స్వస్థలాలకు తరలించామని మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మచిలీపట్నానికి చెందిన గెల్లి కిషోర్ పరిస్థితి మొదట్లో అత్యంత విషమంగా ఉన్నా ఏపీ భవన్ ప్రత్యేక శ్రద్ధతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని మంత్రి పేర్కొన్నారు. హో చి మిన్ సిటీలోని ‘చో రే’ ఆసుపత్రిలో 12 రోజుల అత్యవసర చికిత్స అనంతరం కిషోర్ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిందని.. వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడి సాధారణ విమానంలో ప్రయాణించే స్థాయికి కోలుకోవడం సంతోషకరం అని మంత్రి తెలిపారు. భారత ఎంబసీ, వియత్నాం ప్రభుత్వం, స్థానిక తెలుగు సంఘాలతో పాటు కిషోర్ కుటుంబ సభ్యులతో నిరంతరం టచ్‌లో ఉంటూ బాధితుడికి ఏపీ భవన్ బృందం పూర్తి వైద్య సదుపాయాలు అందించిందన్నారు. అలాగే ప్రమాదం జరిగిన ఫు కుయోక్ దీవి నుంచి క్షతగాత్రుడికి పూర్తి వైద్య సాయం అందడంతో పాటు కోలుకునే వరకు ప్రతి దశలోనూ సహాయం అందించామని మంత్రి చెప్పారు. క్షతగాత్రుడు ఫు కుయోక్ దీవి నుంచి కోలుకుని ఇంటికి చేరుకునే వరకు భారత ఎంబసీ, వియత్నాం ప్రభుత్వం, స్థానిక తెలుగు సంఘాలతో ఏపీ భవన్ ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తోందని... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేసి ఈ సహాయక చర్యలను విజయవంతంగా పూర్తి చేశాయని మంత్రి కొండపల్లి తెలిపారు.

# ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

**- భారీ జనసమీకరణతో చారిత్రాత్మక సభ నిర్వహించాలి**

**--మంత్రుల సమీక్ష**









**భోగాపురం, జూలై 26:**
ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో జీఎంఆర్ అడ్మిన్ బ్లాక్‌లో ఆదివారం మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్ధన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు.మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ప్రధానమంత్రి సభకు ఉత్తరాంధ్ర వ్యాప్తంగా భారీగా ప్రజలను సమీకరించాలని సూచించారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాతో పాటు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఉదయం 8 గంటలకే ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ అందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పార్కింగ్ కోసం తగిన ప్రైవేటు స్థలాలను గుర్తించి, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి పర్యటనలో వీవీఐపీ, వీఐపీ, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక కౌంటర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఏర్పాటును సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రధానమంత్రి మోదీకి 13 వేల మంది బాలికలతో అరకు ధీంసా గిరిజన నృత్యం ద్వారా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 6 వేల మంది, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 5 వేల మంది, పోలవరం ప్రాంతం నుంచి 2 వేల మంది బాలికలు పాల్గొంటారని చెప్పారు.ఈ సందర్భంగా అధికారులు ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి సమావేశంలో వివరించగా, ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు సూచించారు.

# అమ్మ అక్షరదీపం వేల ఆశయాలకు వెలుగు

**- అమ్మ అసోసియేషన్ చేయూతతో ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయండి**

**- అమ్మ స్ఫూర్తితో మరింత మంది స్వచ్ఛందంగా ముందుకు రండి**

**- పేదల జీవితాల్లో వెలుగులు నింపడంలో భాగస్వాములు కండి**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా - విజయవాడతేదీ: జూలై 25, 2026**
విద్య అనేది ఎవరూ దోచుకోలేని సంపదని.. ఒక విద్యార్థికి అందించే సహాయం ఒక కుటుంబ భవిష్యత్తును వెలిగించే దీపమని... ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) అందించే చేయూతతో విద్యార్థుల కలలకు రెక్కలు వస్తాయని భవితకు భరోసా ఇస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం నగరం లోని అమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన విద్యార్థినీవిద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేసి అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి ఎట్టడం అంటే దేశ భవిష్యత్తును నిర్మించడమని అన్నారు. ప్రభుత్వంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన ఉత్తీర్ణతా శాతం ఇందుకు నిదర్శనమన్నారు. ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకిగా మారకుండా వివిధ పథకాల ద్వారా విద్యార్థులకు చేయూత అందిస్తూ, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలను ప్రభుత్వం విస్తృతం చేస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విజ్ఞానం, సాంకేతికత, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన విజయానికి మూలస్తంభాలని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని అన్నారు.అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్నపీ4 విధానం ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. జిల్లాలో దాదాపు 70 వేల బంగారు కుటుంబాలకు 7,000 మంది మార్గదర్శులు ద్వారా చేయూత లభిస్తోందని తెలిపారు. అమ్మ సంస్థ తరహాలో ఎంతోమంది వ్యక్తిగతంగా, సంస్థల పరంగా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కొందరు పారిశ్రామికవేత్తలు కూడా పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేయి కలుపుతున్నారన్నారు.కుటుంబాలు ఆర్థికంగా బలపడితే పిల్లల చదువుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) అధ్యక్షులు గారపాటి సతీష్ బాబు మాట్లాడుతూ సభ్యుల సహకారం తీసుకుని సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయం అందిస్తున్నామని తెలిపారు.ఈ ఏడాది 425 మంది విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో రూ. 21.30 లక్షలు, రూ. 60 వేల విలవగల నోట్ బుక్స్ ను అందజేస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమం కింద విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం 16 లక్షలతో విశ్రాంతి భవనం నిర్మించి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు చేయూత అందించే కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో బోయపాటి శివరామకృష్ణయ్య నగర పాలక సంస్థ పాఠశాలను 2014 సంవత్సరంలో దత్తత తీసుకుని అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేస్తున్న పి 4 కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జి.వి.సుబ్బారావు, డి.దుర్గాప్రసాద్ సంయుక్త కార్యదర్శి కె.దుర్గా మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు టి.రమేష్ బాబు, వై.శివరామకృష్ణ, ఆర్ శ్రీనివాసరావు, పి.వెంకటరావు, సయద్ వలి భాషా, వై.శివరామ కృష్ణ, ఎన్ . సీతారామ ప్రసాద్, టి.సాంబశివరావు, బి.సుధాకర్, కె.వెంకటేశ్వర రావు, గురుజిత్ సింగ్ సహాని, రామ కోటేశ్వరరావు సభ్యులు, మాజీ కార్యవర్గ సభ్యులు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జింబాబ్వేపై భారత్ ఘనవిజయం.




జింబాబ్వేతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో భారత జట్టు 90 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో చేజిక్కించుకుని తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు 17.5 ఓవర్లలో కేవలం 129 పరుగులకే కుప్పకూలిపోయింది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ విధ్వంసంఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డారు. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 81 పరుగుల తుఫాన్ ఇన్నింగ్స్ ఆడగా, యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకు భారీ స్కోరు అందించారు. వీరిద్దరి వీరబాదుడు వల్లనే టీమిండియా అనుకున్న స్కోరు కంటే ఎక్కువ పరుగులు చేయగలిగింది. భారత్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక జింబాబ్వే బ్యాటర్లు వరుసగా వికెట్లు పారేసుకుని ఓటమిపాలయ్యారు. పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు గాయం.. మూడో టి20లో మార్పులభారత విజయంలో కీలక పాత్ర పోషించిన యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ దురదృష్టవశాత్తు గాయపడ్డాడు. తన రెండో ఓవర్ వేస్తున్న సమయంలో రెండో బంతికి కండరాల నొప్పితో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. మైదానం వీడక ముందే ప్రిన్స్ రెండు కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. మ్యాచ్ అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ప్రిన్స్ యాదవ్ గాయం కారణంగా ఆదివారం జరగబోయే మూడో, చివరి టి20 మ్యాచ్‌లో భారత తుది జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశాడు. జట్ ప్రదర్శనపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసలుమ్యాచ్ ముగిసిన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ జట్టు సభ్యులపై ప్రశంసల జల్లు కురిపించాడు. "ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఈ పిచ్‌పై 180 నుంచి 200 పరుగులు చేస్తే చాలు అనుకున్నాం, కానీ మనోళ్లు ఏకంగా 219 పరుగులు చేశారు. ఇది

# రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తల్లో నిజం లేదు

టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా, మీడియాలో తీవ్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ మైదానంలో జరిగిన మ్యాచ్ రోహిత్‌కి చివరి వన్డే కానుందంటూ వచ్చిన వార్తలపై బీసీసీఐ స్పందించింది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ గురించిన వార్తలన్నీ శుద్ధ అబద్ధాలని, అవన్నీ కేవలం పుకార్లు మాత్రమేనని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టంగా ప్రకటించారు. గతంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కూడా ఈ వార్తలను ఖండించిన సంగతి తెలిసిందే.

రాజీవ్ శుక్లా ఏమన్నారంటే?

ఆగ్రాలో జరిగిన యూపీ టీ20 లీగ్ మినీ వేలం కార్యక్రమంలో పాల్గొన్న రాజీవ్ శుక్లా రోహిత్ శర్మ భవిష్యత్తుపై క్లారిటీ ఇచ్చారు. "రోహిత్ శర్మ మన భారత జట్టులో కీలక సభ్యుడు. ఆయన దేశం తరఫున ఆడటం కొనసాగిస్తారు. మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ప్రస్తుతం రోహిత్ రిటైర్మెంట్ తీసుకునే ఆలోచన లేదా ప్రశ్నే లేదు" అని తేల్చి చెప్పారు. ఈ ప్రకటనతో హిట్‌మ్యాన్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

విమర్శకులకు బ్యాట్‌తోనే సమాధానం

తన రిటైర్మెంట్‌పై పుకార్లు షికార్లు చేస్తున్న సమయంలోనే రోహిత్ శర్మ లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌పై 138 పరుగుల చారిత్రాత్మక సెంచరీతో చెలరేగిపోయాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో వన్డే సెంచరీ చేసిన తొలి భారతీయ క్రికెటర్‌గా రోహిత్ రికార్డులకెక్కాడు. తనను విమర్శిస్తున్న వారికి ఈ విధ్వంసకర శతకంతోనే సమాధానమిచ్చాడు. కాగా, రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

వదంతులను పట్టించుకోను: రోహిత్ శర్మ

తనపై వస్తున్న పుకార్లపై రోహిత్ శర్మ స్వయంగా స్పందించాడు. బీసీసీఐకి ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన రోహిత్, "బయట ప్రపంచంలో లేదా సోషల్ మీడియాలో తన గురించి ఏం మాట్లాడుకుంటున్నారో తాను అస్సలు పట్టించుకోను. దేశం కోసం, టీమ్ కోసం అత్యుత్తమంగా ఆడటమే నా ముందున్న ఏకైక లక్ష్యం. నన్ను ఎప్పుడూ దేశం కోసం ఆడటానికే ప్రోత్సహించారు, భవిష్యత్తులో కూడా అలాగే ఆడతాను" అని తెలిపాడు.

రికార్డుల వేటలో హిట్‌మ్యాన్ రోహిత్

రోహిత్ శర్మ అంతర్జాతీయ వన్డే కెరీర్ ఎంతో ఘనమైనది. ఇప్పటివరకు 288 వన్డే మ్యాచ్‌లు ఆడిన రోహిత్ ఏకంగా 11,895 పరుగులు



సాధించాడు. తన వన్డే కెరీర్‌లో ఇప్పటివరకు 34 సెంచరీలు పూర్తి చేసుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంకా ఎన్నో రికార్డులను తిరగరాసే సత్తా తనలో ఉందని ఈ లార్డ్స్ సెంచరీతో రోహిత్ మరోసారి నిరూపించాడు.

# రోహిత్, బాబర్‌ల చెత్త రికార్డును సమం చేసిన సికందర్ రజా



భారత్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాకు వరుస పరాభవాలు ఎదురవుతున్నాయి. రెండో టీ20లో ఐదు పైసల పరుగు కూడా చేయకుండా డకౌట్‌గా వెనుతిరిగిన రజా.. రోహిత్ శర్మ, బాబర్ అజామ్‌ల పేరిట ఉన్న ఒక అత్యంత నిరాశాజనకమైన ప్రపంచ రికార్డును సమం చేశాడు.కెప్టెన్‌గా ఆరో డక్: రోహిత్, బాబర్‌ల సరసన నిలిచిన రజా.. జింబాబ్వే ఆల్ రౌండర్, కెప్టెన్ సికందర్ రజాకు అస్సలు కలిసిరావడం లేదు. హరారే వేదికగా శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లోనూ అతడు ఘోరంగా విఫలమయ్యాడు. ప్రిన్స్ యాదవ్ వేసిన పదునైన బౌన్సర్‌ను సరిగ్గా అంచనా వేయలేక డకౌట్‌గా పెవిలియన్ దారిపట్టాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒక జట్టు కెప్టెన్‌గా సికందర్ రజాకు ఇది 6వ డకౌట్ కావడం గమనార్హం.దీంతో పూర్తి స్థాయి గుర్తింపు ఉన్న ఐసీసీ సభ్య దేశాల కెప్టెన్లలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే అవుటైన అవాంఛనీయ రికార్డు జాబితాలో రజా చేరాడు. గతంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌లు కూడా నాయకులుగా చెరో 6 సార్లు జిబాబ్వే తరపున అత్యధిక డక్‌ల రేసులో రజా..భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌట్ కావడం ద్వారా సికందర్ రజా తన అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో మొత్తం డక్‌ల సంఖ్యను 10కి పెంచుకున్నాడు. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే అవుటైన ఆటగాళ్ల జాబితాలో రజా ప్రస్తుతం రెండో స్థానానికి చేరుకున్నాడు.

ఆస్ట్రేలియా పర్యటనతో పాటు స్వదేశంలో ఆడుతున్న మ్యాచ్‌లలోనూ రజా బ్యాటింగ్ ఫామ్ ఆందోళనకరంగా మారింది. జింబాబ్వే తరపున అత్యధికంగా 11 సార్లు డకౌట్ అయ్యారు. ప్రస్తుతం రజా వీరిద్దరి రికార్డును సమం చేయగా, ఈ జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ 8 డక్‌లతో మొదటి స్థానంలో ఉన్నాడు.

# రూ.1.02 లక్షల లోపు అత్యుత్తమ మైలేజీనిచ్చే స్కూటర్లు

మీరు ప్రయాణానికి సరసమైన, అందమైన, మంచి మైలేజీ ఇచ్చే స్కూటర్ కోసం చూస్తున్నట్లయితే ఇవి తెలుసుకోవాల్సిందే. మార్కెట్లో ఎన్నో స్కూటర్ కంపెనీలు, వందలాది ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు) ఉండటంతో ప్రతిరోజూ అనేక కొత్త మోడళ్లు పరిచయం అవుతుండటంతో వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఇలాంటి వాతావరణంలో మీరు ఆఫీసు ఉపయోగం కోసం ఒక వాహనాన్ని కొనాలని చూస్తున్నారా? అయితే ఈ వాహనాల గురించి తెలుసుకోవాల్సిందే. యమహా ఏరాక్స్ 155: ఇది ప్రస్తుతం భారతీయ యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన 'పెర్ఫార్మెన్స్ మ్యాక్సీ స్కూటర్'. దీని ఎక్స్-షోరూమ్ ధర సుమారుగా రూ. 1.43 లక్షల నుండి రూ. 1.46 లక్షల వరకు ఉంటుంది. సొగసైన ట్విన్-ఎల్ఈడీ హెడ్‌లైట్లు మరియు క్లాసీ ఫ్రంట్ డిజైన్‌తో దీని రూపం చాలా స్పోర్టీగా ఉంటుంది. ఆఫీసుకు వెళ్లేవారు దీనిపై ప్రయాణిస్తున్నప్పుడు దీని పదునైన, ప్రత్యేకమైన రూపం రోడ్డుపై ఉన్న ప్రతి ఒక్కరి దృష్టిని నిస్సందేహంగా ఆకర్షిస్తుంది. ఇది 42- 48కిలో మీటర్ల మైలేజీ ఇస్తుందని తెలుస్తోంది. ఈ స్కూటర్‌కు =15లో ఉన్నటువంటి అదే 155సీసీ, లిక్విడ్-కూల్డ్, 4-వాల్వ్ ఇంజన్‌ను అమర్చారు. ఇది 14.75 పీఎస్ పవర్, 13.9 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీని ముఖ్య ఫీచర్లలో ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, సింగిల్-ఛానల్ ఏబీఎస్‌తో కూడిన ఫ్రంట్ డిస్క్ బ్రేకులు, బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన డిజిటల్ కన్సోల్ ఉన్నాయి. దీని పెద్ద 14-అంగుళాల అల్లాయ్ వీల్స్, వెడల్పాటి టైర్లు రైడింగ్ చేసేటప్పుడు అద్భుతమైన స్థిరత్వాన్ని అందిస్తాయి.యమహా ఏరాక్స్ 155: ఇది ప్రస్తుతం భారతీయ యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన 'పెర్ఫార్మెన్స్ మ్యాక్సీ స్కూటర్'. దీని ఎక్స్-షోరూమ్ ధర సుమారుగా రూ. 1.43 లక్షల నుండి రూ. 1.46 లక్షల వరకు ఉంటుంది. సొగసైన ట్విన్-ఎల్ఈడీ హెడ్‌లైట్లు మరియు క్లాసీ ఫ్రంట్ డిజైన్‌తో దీని రూపం చాలా స్పోర్టీగా ఉంటుంది. ఆఫీసుకు వెళ్లేవారు దీనిపై ప్రయాణిస్తున్నప్పుడు దీని పదునైన, ప్రత్యేకమైన రూపం రోడ్డుపై ఉన్న ప్రతి ఒక్కరి దృష్టిని నిస్సందేహంగా ఆకర్షిస్తుంది. ఇది 42- 48కిలో మీటర్ల మైలేజీ ఇస్తుందని తెలుస్తోంది. ఈ స్కూటర్‌కు =15లో ఉన్నటువంటి అదే 155సీసీ, లిక్విడ్-కూల్డ్, 4-వాల్వ్ ఇంజన్‌ను అమర్చారు. ఇది 14.75 పీఎస్ పవర్, 13.9 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీని ముఖ్య ఫీచర్లలో ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, సింగిల్-ఛానల్ ఏబీఎస్‌తో కూడిన ఫ్రంట్ డిస్క్ బ్రేకులు, బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన డిజిటల్ కన్సోల్ ఉన్నాయి. దీని పెద్ద 14-అంగుళాల అల్లాయ్ వీల్స్, వెడల్పాటి టైర్లు రైడింగ్ చేసేటప్పుడు అద్భుతమైన స్థిరత్వాన్ని బెర్గ్మాన్ స్ట్రీట్ 125: ఇది చాలా సరసమైన 'మాక్సీ-స్టైల్' స్కూటర్. దీని ధర రూ. 1.02 లక్షల నుండి రూ. 1.13 లక్షల మధ్య (ఎక్స్-షోరూమ్) ఉంటుంది. దీని డిజైన్ యూరోపియన్ మాక్సీ స్కూటర్ల నుండి ప్రేరణ పొందింది. ఇందులో పెద్ద విండ్‌స్క్రీన్, వెడల్పాటి



ముందు భాగం, సౌకర్యవంతమైన లెగ్‌రూమ్ ఉన్నాయి. ఆఫీస్ బ్యాగులు, ఇతర అవసరమైన వస్తువులను నిల్వ చేయడానికి సీటు కింద 24.6 లీటర్ల పెద్ద స్టోరేజ్ స్పేస్ ఉంటుంది. ఇది లీటర్‌కు 48 నుంచి 50 కిలోమీట్ల వరకు మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇది మెరుగైన పనితీరును అందించే 124సీసీ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 8.58బీహెచ్‌పీ పవర్, 10.2 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల నగర ట్రాఫిక్‌లో దీనిని నడపడం సులభం అవుతుంది. దీని ఉన్నత శ్రేణి మోడళ్లలో ఇప్పుడు 4.2-అంగుళాల కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ టర్న్-బై-టర్న్ నావిగేషన్, కీలెస్ ఇగ్నిషన్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ఈ స్కూటర్ లీటరుకు సుమారు 55 నుండి 59 కిలోమీటర్ల మంచి మైలేజీని ఇస్తుంది. అందువల్ల ఇది రోజువారీ ఉపయోగం కోసం ఒక పొదుపైన ఎంపిక.

బెర్గ్మాన్ స్ట్రీట్ 125: ఇది చాలా సరసమైన 'మాక్సీ-స్టైల్' స్కూటర్. దీని ధర రూ. 1.02 లక్షల నుండి రూ. 1.13 లక్షల మధ్య (ఎక్స్-షోరూమ్) ఉంటుంది. దీని డిజైన్ యూరోపియన్ మాక్సీ స్కూటర్ల నుండి ప్రేరణ పొందింది. ఇందులో పెద్ద విండ్‌స్క్రీన్, వెడల్పాటి ముందు భాగం, సౌకర్యవంతమైన లెగ్‌రూమ్ ఉన్నాయి. ఆఫీస్ బ్యాగులు, ఇతర అవసరమైన వస్తువులను నిల్వ చేయడానికి సీటు కింద 24.6 లీటర్ల పెద్ద స్టోరేజ్ స్పేస్ ఉంటుంది. ఇది లీటర్‌కు 48 నుంచి 50 కిలోమీట్ల వరకు మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇది మెరుగైన పనితీరును అందించే 124సీసీ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 8.58బీహెచ్‌పీ పవర్, 10.2 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల నగర ట్రాఫిక్‌లో దీనిని నడపడం సులభం అవుతుంది. దీని ఉన్నత శ్రేణి మోడళ్లలో ఇప్పుడు 4.2-అంగుళాల కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ టర్న్-బై-టర్న్ నావిగేషన్, కీలెస్ ఇగ్నిషన్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ఈ స్కూటర్ లీటరుకు సుమారు 55 నుండి 59 కిలోమీటర్ల మంచి మైలేజీని ఇస్తుంది. అందువల్ల ఇది రోజువారీ ఉపయోగం కోసం ఒక పొదుపైన ఎంపిక.

# మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు! తెలుగు రాష్ట్రాల్లో లేటెస్ట్ రేట్లు ఇవే



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో కనిపిస్తున్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నెలకొన్న అంచనాలు, డాలర్ మారకం విలువలో మార్పుల ప్రభావంతో పసిడి ధరలు మరోసారి పైకి కదిలాయి. దీంతో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో బంగారం కొనుగోలు చేసే వారికి స్వల్ప భారం పడుతోంది.తాజా ధరల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,32,850గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే 10 గ్రాములపై దాదాపు రూ.550 పెరుగుదల నమోదైంది. అదే సమయంలో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,44,930కు చేరగా, గత ధరతో పోలిస్తే సుమారు రూ.600 వరకు పెరిగింది.దేశంలోని ఇతర ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నైల్లో కూడా ఇదే తరహా స్వల్ప పెరుగుదల కనిపించింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ గోల్డ్ కాంట్రాక్టులు దాదాపు 0.4 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఉన్న ఆందోళనలు ఇన్వెస్టర్లను బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల వైపు ఆకర్షిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.వెండి ధరల్లో మాత్రం పెద్దగా మార్పులు కనిపించలేదు. తెలుగు రాష్ట్రాల్లో ఒక గ్రాము వెండి ధర రూ.235గా ఉంది. 100 గ్రాముల వెండి రూ.23,516కు విక్రయిస్తుండగా, కిలో వెండి ధర రూ.2,35,000 నుంచి రూ.2,45,000 మధ్య కొనసాగుతోంది. స్థానిక పన్నులు, తయారీ ఛార్జీలు, నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసం ఉండొచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.బంగారం ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న నేపథ్యంలో కొనుగోలు చేయాలనుకునే వారు రోజువారీ ధరలను పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆభరణాల కొనుగోలులో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ బలపడటం లేదా బలహీనపడటం, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు రానున్న వెండి ధరల దిశను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వావ్.. డీమార్ట్ కంటే తక్కువ ధరలు.. ఈ స్టోర్లలో సూపర్ ఆఫర్స్.. నెలకు మస్త్ పైసల్ ఆదా..



ఇంటికి కావలసిన నిత్యావసర సరుకులు అనగానే మనదేశంలో అందరికీ ముందుగా గుర్తొచ్చేది డిమార్ట్. తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు దొరుకుతాయనే నమ్మకంతో ప్రతి నెలా అక్కడ క్యూ లైన్లలో నిలబడటం అలవాటైపోయింది. అయితే మారుతున్న డిజిటల్ యుగంలో ఆ పరిస్థితి వేగంగా మారుతుంది. మార్కెట్లోకి వచ్చిన పలు కొత్త టెక్నాలజీ యాప్‌లు, మోడరన్ రిటైల్ విభాగాలు ఇప్పుడు డిమార్ట్‌కు గట్టి సవాలు విసురుతున్నాయి. ధరల విషయంలో పోటీ పడటమే కాకుండా కస్టమర్ల సమయాన్ని ఆదా చేసే సరికొత్త వెసులుబాట్లను అందిస్తున్నాయి.

ఆన్‌లైన్ స్టోర్స్‌షాపింగ్ రంగంలో ప్రస్తుతం పెను సంచలనం సృష్టిస్తున్నవి క్విక్ కామర్స్ యాప్‌లు. ఆర్డర్ చేసిన పది నుంచి పదిహేను నిమిషాల వ్యవధిలోనే ఇంటి తలుపు తట్టే బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి యాప్‌లు, నిత్యావసర ఉత్పత్తులపై ప్రత్యేకమైన క్రాష్ డీల్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా మిగులుతుండటంతో చాలా మంది వీటివైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు జియో మార్ట్ ఏకంగా ఎంఆర్‌పీపై 40 శాతం వరకు ఆఫర్లు ఇస్తూ, ఉచిత డెలివరీతో డిమార్ట్‌కు గట్టి పోటీనిస్తోంది. నాణ్యమైన ఆర్గానిక్ సరుకుల కోసం బిగ్ బాస్కెట్ తమ ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తులపై మంచి డిస్కౌంట్లు ఇస్తుండగా.. అమెజాన్ ఫ్రెష్ , ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ పండుగలు, నెలాఖరు ఆఫర్లు, బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి.ఆఫ్‌లైన్ స్టోర్స్‌కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లే కాకుండా నేరుగా వెళ్లి కొనుగోలు చేసే ప్రత్యక్ష స్టోర్లలోనూ అనేక ప్రత్యామ్నాయాలు వచ్చాయి. విశాల్ మెగా మార్ట్‌లో కిరాణాతో పాటు దుస్తులు, హోమ్ అప్లయన్స్ డిమార్ట్ కంటే తక్కువ ధరలకే దొరికే సందర్భాలు ఉన్నాయి. అలాగే రిలయన్స్ స్మార్ట్ బజార్ నిర్వహించే ఒకటి కొంటే ఒకటి ఉచితం ఆఫర్లు మధ్యతరగతి జేబుకు పెద్ద ఊరటనిస్తున్నాయి. ఇక పెద్ద ఎత్తున బల్క్ కొనుగోళ్లు చేసే కుటుంబాలకు మెట్రో హోల్‌సేల్ వంటి చోట్ల దక్కే హోల్‌సేల్ రేట్లు డిమార్ట్ ధరల కంటే తక్కువగా ఉంటున్నాయి.స్మార్ట్ షాపింగ్ఒకప్పుడు తక్కువ ధర అనగానే డిమార్ట్ ఒక్కటే మార్గం అనుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. వినియోగదారులు షాపింగ్ చేసే ముందు ఆన్‌లైన్ యాప్‌లలో లభించే కార్డ్ ఆఫర్లు, ఉచిత డెలివరీ కూపన్లతో పాటు ఆఫ్‌లైన్ ఆఫర్లను పోల్చి చూసుకుంటే.. సమయంతో పాటు ప్రతినెల వేల రూపాయల బడ్జెట్‌ను సులువుగా ఆదా చేసుకోవచ్చు.

సోమవారం,
జులై 27, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# బిగ్‌బాస్‌లోకి గోదావరి అమ్మాయి



స్రవంతి పేపకాయల.. ఈ పేరు గురించి ప్రత్యేక చెప్పక్కర్లేదు. ప్రస్తుత సోషల్ మీడియా ప్రపంచంలో తన రీల్స్, కంటెంట్ వీడియోలతో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది ఈ గోదావరి అమ్మాయి. ఇటీవల కొద్దిరోజులుగా ఆమె పేరు నెట్టింట మారుమోగుతుంది. తాజాగా తన లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది.సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉన్నవారిలో స్రవంతి పేపకాయల ఒకరు. గోదావరి అమ్మాయి అంటూ తన రీల్స్, వీడియోస్ ద్వారా నెట్టింట ఒక్కసారిగా సెన్సేషన్ అయ్యింది. అటు వెబ్ సిరీస్, సినిమాల్లో ఇప్పుడిప్పుడే అవకాశాలు అందుకుంటుంది. అలాగే పలు టీవీ, ఓటీటీ షోలలో పాల్గొని తన మాటలతో, కామెడీ టైమింగ్ తో మరింత పాపులర్ అయ్యింది. తాజాగా స్రవంతి పేపకాయల ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన లైఫ్, పర్సనల్ విషయాల గురించి పంచుకుంది. తన జర్నీ, సినిమా అవకాశాలు, కంటెంట్ క్రియేషన్, బిగ్ బాస్ రియాల్టీ గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది.సదరు ఇంటర్వ్యూలో మీకు బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందా అని అడగ్గా.. "లేదండి.. ఆ బిగ్ బాస్ టైంలో నాకు వేరే షూటింగ్ ఉందండి. ఒకవేళ మధ్యలో ఏమైనా పిలిస్తే ఒక రోజు వెళ్తాను. నాకు ఆఫర్ వచ్చింది " అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికి తనకు బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందని.. కానీ ప్రస్తుతం తాను సినిమాలు, వెబ్ సిరీస్ పై దృష్టిపెట్టినట్లు తెలిపింది.స్రవంతి పెపకాయల.. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో స్వతంత్రంగా వినోదాత్మక రీల్స్ , షార్ట్స్ చేస్తూ ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. తన రీల్స్ ,వీడియోలలో ఆంటీ, పనిమనిషి, వార్డెన్ వంటి వివిధ విశేషంగా అలరించారు.

# ఇప్పుడు అమ్మ నా పక్కన ఉంటే బాగుండేది.



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటాగా నటించిన లేటేస్ట్ మూవీ చెన్నై లవ్ స్టోరీ. జూలై 24న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో శ్రేయాస్ మీడియా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కథానాయిక శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం తనకెంతో ప్రత్యేకమని, కొంత భావోద్వేగంగా ఉన్నానని ఆమె తెలిపారు. తన దివంగత తల్లిని గుర్తుచేసుకుంటూ, తన సక్సెస్ తన తల్లి చూసుంటే ఎంతో సంతోషించేవారని పేర్కొన్నారు. అయితే, తన తల్లి తనను చూస్తోందని, ఆమె ఆశీస్సుల వల్లే ఈ పేరు వచ్చిందని గౌరీ ప్రియ అన్నారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా తాను ఏదీ సాధించలేనని, తన తండ్రికి కూడా కృతజ్ఞతలు తెలిపారు."ఇంతటి మంచి పేరు, సక్సెస్ వస్తున్న ఈ సమయంలో మా అమ్మ నా పక్కన ఉండి ఉంటే ఎంతగానో సంతోషించేది. నన్ను ఇలా చూసి ఉంటే ఎంత బాగుండేదో అని చుట్టుపక్కల అందరూ అంటున్నారు. కానీ నాకు తెలుసు.. నా అమ్మ ఎప్పటికీ పైనుంచి నన్ను చూస్తూ ఆశీర్వదిస్తూనే ఉంటుంది" అంటూ భావోద్వేగానికి గురైంది.ఒక అమ్మాయి ప్రేమిస్తే ఎలా ఉంటుందో, ఆమె ప్రేమ గెలిచినా, విఫలమైనా ఆ కోణం నుండి సినిమాను చూపించాలనే ఆలోచన చేసినందుకు రచయిత సాయి రాజేష్‌కి, అలాగే తనను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అందమైన కథను అద్భుతంగా డైరెక్ట్ చేసిన రవి నంబూరికి హ్యాట్సాఫ్ చెప్పారు. సహనటుడు కిరణ్ అబ్బవరం గురించి మాట్లాడుతూ, ఒక ప్రేమకథలో రెండు పాత్రల మీద రెండున్నర గంటలు కథను నడిపించడం కష్టమైన విషయమని, కానీ కిరణ్ అద్భుతంగా నటించారని కొనియాడారు. కిరణ్‌లో ఒక మంచి స్నేహితుడిని కనుగొన్నానని, తనను ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సిరి, పూజ, మహేందర్, నవీన్, త్రిగుణ్ సహా చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చివరగా, ఒక తెలుగు అమ్మాయిగా, తన కెరీర్‌లో ఇంత తొందరగా ఇంత మంచి కథ, పాత్ర లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని శ్రీ గౌరీ ప్రియ అన్నారు.

# డైరెక్టర్ లవర్ చెప్పిందని నా సీన్స్ తగ్గించేశారు.



పూనమ్ కౌర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చేసింది కొన్ని సినిమాలే అయినా తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటుంది పూనమ్ కౌర్. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తన సినీ జీవితానికి సంబంధించిన అనేక తెలియని కోణాలను, వ్యక్తిగత ఆకాంక్షలను పంచుకుంది పూనమ్ కౌర్. నటన రంగంలోకి అనుకోకుండా వచ్చినట్లు తెలిపిన పూనమ్, తన అసలు లక్ష్యాలు, బాలీవుడ్‌లో ఎదురైన చేదు అనుభవాలు, ప్రముఖులతో సమావేశాలు, ఒక సినిమా గురువుతో జరిగిన విచిత్ర సంభాషణ గురించి పంచుకుంది. పూనమ్ కౌర్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సినిమాలపై పెద్దగా ఆసక్తి చూపలేదని తెలిపింది. తన తల్లి పడిన కష్టాలను చూసి, కపిల్ సిబల్ లేదా రామ్ జేఠ్ మలానీ వంటి ప్రభావవంతమైన లాయర్‌గా మారాలని కలలు కన్నానని ఆమె తెలిపింది.ఒకానొక సందర్భంలో తాను నివసిస్తున్న భవనం తన తండ్రిది అని, ఆయన మరణానంతరం తన తల్లి ఆస్తి కోసం ఏడేళ్లపాటు పోరాడారని గుర్తుచేసుకుంది. లాయర్ కావడానికి ఎన్ఐఎఫ్‌టీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ), నాల్సార్ (నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్) ప్రవేశ పరీక్షలు రాశానని, నాల్సార్‌లో అవకాశం వస్తే సినిమా వైపు వచ్చేదాన్ని కాదని ఆమె స్పష్టం చేశారు. నటనను తాను కేవలం "పార్ట్-టైమ్ జాబ్" లాగానే చూశానని చెప్పుకొచ్చింది. అలాగే పూనమ్ కౌర్ బాలీవుడ్‌లో తన మొదటి సినిమా అనుభవాన్ని పంచుకుంది. ఒక పెద్ద ఖాన్ బంధువు తీస్తున్న సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది.అయితే, షూటింగ్ సమయంలో తనకు జరిగిన అవమానాలను ఆమె చెప్పుకొచ్చింది. కావాలనే తన సన్నివేశాలను తగ్గించడం, తన మేకప్‌ను మార్చడం, ఒక ప్రత్యేక నటి (దర్శకుడి ప్రియురాలు)కి అనుకూలంగా వ్యవహరించడం వంటివి జరిగాయని ఆమె తెలిపింది. పది రోజుల షూటింగ్ ఆగిపోయిన తర్వాత, దర్శకుడి తీరును నిరసిస్తూ ఆమె ఆ సినిమా నుంచి బయటకు వచ్చేశా.. ఆ సినిమా వివేక్ అగ్నిహోత్రికి చెందినదని ఆమె తెలిపింది. ఆ సమయంలో

# అలాంటి హీరో ఇప్పుడు ఇండస్ట్రీలో అతనొక్కడే..



సినీ నటుడు జగపతి బాబు సినిమాలకు గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుతం సహాయ నటుడిగా సెకండ్ ఇన్నింగ్స్ లో దూసుకుపోతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సుదీర్ఘ కెరీర్, ముఖ్యంగా "రెండో ఇన్నింగ్స్" విజయాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. సినీ పరిశ్రమలో ప్రచారంలో ఉన్న "సెంటిమెంట్లు" అనే భావనను ఆయన ఖండించారు. ఒక నటుడు సినిమాలో ఉంటే అది హిట్ అవుతుంది లేదా ఫ్లాప్ అవుతుంది అని నమ్మడం "రబ్బిష్" అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అరవింద సమేత చిత్రంలో తన బసిరెడ్డి పాత్ర గురించి బహిరంగంగా ప్రశంసించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఎన్టీఆర్ నిజాయితీని మెచ్చుకున్నారు. అలాంటి ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇచ్చే హీరోలు చాలా తక్కువని అన్నారు. తన "రెండో ఇన్నింగ్స్"లో లెజెండ్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల ద్వారా విలన్‌గా తాను గుర్తింపు పొందడానికి కారణం, తనను సినిమాలో పెట్టుకోవడం వల్ల కాదని, లక్కీగా బోయపాటి శ్రీను తనకు ఆ క్యారెక్టర్ ఇవ్వడం, ఆ క్యారెక్టరైజేషన్‌లో దమ్ము ఉండటమేనని స్పష్టం చేశారు. ప్రతిదీ తాత్కాలికమేనని, సినీ విజయం ఎల్లప్పుడూ ఒకే నటుడిపై ఆధారపడదని ఆయన చెప్పారు.విలన్‌గా విజయాలు సాధించిన తర్వాత, ఇప్పుడు ప్రధాన పాత్రల్లోకి తిరిగి రావాలనే ఆకాంక్షపై ప్రశ్నించగా, అది ధైర్యం కాదని, తనకంటూ ఒక "నీష్" (చిన్న మూల) వెతుక్కుంటున్నానని వివరించారు. ఎప్పుడూ హీరోల మీద ఆధారపడకుండా, తన మీద తాను ఆధారపడాలని కోరుకుంటున్నానని, అలాంటి చిన్న సినిమాల్లో "హీరో" కాకుండా "మోర్ లీడ్ క్యారెక్టర్" చేయాలని ఆశిస్తున్నానని తెలిపారు. వదలా వంటి చిత్రాల ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని చూస్తున్నానని, అయితే క్యారెక్టర్ రోల్స్‌ను కూడా తాను వదులుకోనని అన్నారు. "ఏది వదలను" అంటూ, మంచి కథ, బలమైన కాన్సెప్ట్ ఉన్న పాత్రలకే తన ప్రాధాన్యత అని చెప్పారు.ఈ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు, హింస, మరణం వంటివి నేడు కేవలం "ఎంటర్టైన్మెంట్" అయిపోయాయని విచారం వ్యక్తం చేశారు. మనుషుల మధ్య గ్రీడ్, ఈగో, పవర్ కోసం జరిగే పోరాటాలు, చావులను కూడా ప్రజలు నవ్విస్తూ చూస్తున్నారని అన్నారు. నిజమైన బాధ కన్నా యాక్టింగ్ ఎక్కువైందని, ప్రతి ఒక్కరూ యాక్టర్స్‌గా మారిపోయారని ఆయన గమనించారు. సినిమా రంగంలో కూడా వయొలెన్స్, థ్రిల్లర్లు, మర్డర్లు వంటి నెగటివిటీ ఎక్కువగా చూపిస్తున్నారని, అందమైన సినిమాలు, గొప్ప సినిమాలు తక్కువగా వస్తున్నాయని చెప్పుకొచ్చారు.

# పెళ్లిపై తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పిన నందిని రెడ్డి..



తెలుగు సినీ దర్శకురాలు నందిని రెడ్డి ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితంపై అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన మొదటి సినిమా అలా మొదలైంది స్క్రిప్ట్ చెప్పే సమయం నుంచి విడుదలకు దాదాపు ఆరేళ్ల సమయం పట్టిందని, ఈ కాలం తన జీవితంలో అత్యంత కష్టమైన దశ అని ఆమె పేర్కొన్నారు. తన స్నేహితులు డాక్టర్లుగా స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సమయంలో తాను మాత్రం సినిమా కోసం పోరాడాల్సి వచ్చిందని, అప్పుడప్పుడు తాను తప్పు చేశానా అని కూడా అనిపించేదని నందిని రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పుడు, స్నేహితులు బిల్లులు కట్టేవారని, తాను పాకెట్ మనీ కోసం వరల్డ్ స్పేస్ కంపెనీలో రేడియో జాకీగా పనిచేసినట్లు తెలిపారు. అప్పుడు నెలకు 20,000 రూపాయలు వచ్చేదని, వాటితో తన టూ-వీలర్ పెట్రోల్ ఖర్చులు పోగా, కొంత మిగిలేదని వివరించారు. అలా మొదలైంది సినిమా కోసం మొదట 5 లక్షల రూపాయలు రెమ్యునరేషన్‌గా ఇచ్చారని, తరువాత తమిళ రైట్స్ అమ్ముడయ్యాక 20 లక్షలు అదనంగా లభించాయని ఆమె చెప్పారు. ఈ డబ్బుతో తన తల్లి పదేళ్ల పాత అప్పును తీర్చినట్లు నందిని రెడ్డి తెలిపారు. అప్పట్లో రౌడీ షీటర్లు ఇంటికి వచ్చి బెదిరించేవారని, సినిమా రిలీజ్ అయిన తర్వాత డబ్బు ఇస్తానని నమ్మకంగా చెప్పి వారిని పంపించేసి, సినిమా హిట్ అయ్యాక నిర్మాత దాము గారి నుంచి డబ్బు తీసుకొని అప్పు తీర్చినట్లు వివరించారు.

# ఆ స్టార్ హీరోయిన్ ఈ సీరియల్ నటి వదినా..



బుల్లితెరపై సీరియల్స్ ద్వారా తనదైన ముద్ర వేసిన నటి సుజిత. తెలుగు, తమిళం భాషలలో పలు సీరియల్స్ చేసిన ఆమె.. వదినమ్మగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఇందులో తన సహజ నటనతో కట్టిపడేసింది. నిజానికి సుజిత.. చైల్డ్ ఆర్టిస్టుగా సినిమాల్లోకి అడుగుపెట్టింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన పసివాడి ప్రాణం సినిమాలో బాలనటిగా కనిపించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. చిరంజీవి నటించిన జై చిరంజీవా మూవీలో చిరు చెల్లిగా కనిపించింది. ప్రస్తుతం తమిళంలో పలు సీరియల్స్ చేస్తూ బిజీగా ఉంది. కానీ ఇప్పుడు సుజిత బ్యాగ్రౌండ్ గురించి సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తుంది. ఆమె అన్న ఇండస్ట్రీలో ఫేమస్ డైరెక్టర్ అని మీకు తెలుసా.. ?.. అవును.. సుజిత అన్న పేరు సూర్య కిరణ్. ఇటీవలే సూర్య కిరణ్ అనారోగ్య సమస్యలతో మరణించారు.
దర్శకుడు సూర్య కిరణ్ భార్య ఒకప్పటి హీరోయిన్ కళ్యాణి. వీరిద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కానీ కొన్నేళ్లకే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సుజిత మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన అన్నా, వదిన విడిపోయారని తెలిపింది సుజిత. విడాకుల తర్వాత కళ్యాణి సినిమాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఒంటరిగా ఉంటున్నారు. కానీ ఒకప్పుడు తెలుగులో ఆమె ఫేమస్ హీరోయిన్. 2000వ దశకంలో హోమ్లీ హీరోయిన్